

బంధువులను ఓదార్చుతున్న కలెక్టర్‌వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్

శ్రమించారు.. గుర్తించారు..

మూడో రోజు తీరానికి ఐదో మృతదేహం

చీరాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం వాడరేవు తీరంలో గల్లంతైన ఐదుగురు మృతదేహాలను ఎట్టకేలకు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు బీటెక్ విద్యార్థుల మృతదేహాలు ఆదివారమే తీరానికి చేరు కున్నాయి. కాగా గల్లంతైన చీరాల ప్రాంతానికి చెం దిన పదో తరగతి విద్యార్థి కోట గౌతమ్ కృష్ణ ప్రసాద్(16), బీటెక్ విద్యార్థి కూచిన షారోన్ రాజ్(18) కోసం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 10 బోట్లు, 10 మంది వీఆర్వోలు, ఆరు డ్రోన్ కెమెరాలు, 10 మంది గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. వారి జాడ తెలిస్తే తెలియజేయాలని మత్స్యకార గ్రామాల్లో చాటింపు కూడా చేయించారు. ఈ క్రమంలో సోమవారం గౌతమ్ మృతదేహం ఒడ్డుకు చేరగా, షారోన్ ఆచూకీ తెలియలేదు. బిడ్డ కడచూపు కోసం తల్లిదండ్రులు, బంధువులు మూడు రోజులుగా తీరంలో విలపించసాగారు. 24 గంటల్లో అతడిజాడ గుర్తిస్తామని కలెక్టర్, ఎస్పీ హామీ ఇచ్చారు. దీంతో గాలింపు ముమ్మరం చేయడంతో మంగళవారం మధ్యాహ్నం నాగులుప్పలపాడు సమీపంలో ఏటికుప్పాక వద్ద షారోన్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అక్క పెళ్లికని వచ్చి..

వేటపాలెం మండలం కొత్తపేటకు చెందిన కూచిన షారోన్ తల్లిదండ్రులు వసంతరాజు, సునంద వ్యవసాయ కూలీలు. గత గురువారం షారోన్ అక్కకు వివాహం జరిగింది. ఇందుకోసం రాజమండ్రిలో బీటెక్ చదువుతున్న షారోన్ చీరాలకు వచ్చాడు. వివాహం అనంతరం కృష్ణప్రసాద్‌తో సముద్రానికి వచ్చి మృత్యువాత పడ్డాడు. కృష్ణప్రసాద్ తల్లిదండ్రులైన కోట ప్రసాద్, మాధవీ కూడా కూలీలే.

రిసార్ట్స్ నిర్వాహకులపై విమర్శలు

ఇటీవల వరుసగా మరణాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో రిసార్ట్స్ నిర్వాహకులపై ప్రజలు మండి పడుతున్నారు. ఇష్టారీతిగా రిసార్ట్స్ నిర్మించుకుని వ్యాపారాలు సాగిస్తున్న నిర్వాహకులు ప్రజల ప్రాణాలకు ఎందుకు బాధ్యత వహించరని ఆగ్రహిస్తున్నారు. ప్రమాదాల నియంత్రణకు గతంలో గజ ఈతగాళ్లను నియమించి ఆ బాధ్యతను రిసార్ట్స్ యజమానులకు గతంలో ఎమ్మెల్యే కొండయ్య అప్పగించారు. అయితే నిర్వాహకులు ఎమ్మెల్యే చెప్పినట్లు చేయడంలేదు. అందువల్లే తరచూ మరణాలు సంభవిస్తున్నాయని పర్యాటకులు ఆరోపిస్తున్నారు.

ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు - కలెక్టర్

ఇకపై తీరంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గాలింపులో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. పర్యాటకులు ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.

ఔషధాలకు.. అమలేది!



ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న ఔషధాల అమ్మకాలపై పర్యవేక్షణ కొరవడింది. చాలా రకాల మందులకు తగ్గిన జీఎస్టీ అమలు కావడం లేదు. ఇంకా పాత ఎంఆర్‌పీ ప్రకారమే మందులు విక్రయిస్తున్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అంటూ అధికార యంత్రాంగం ప్రచారానికే పరిమితమైంది తప్పిస్తే క్షేత్ర స్థాయిలో అమ లు చేయించడంలో విఫలమవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రచార ఆర్భా టానికి ఇచ్చిన ప్రాధాన్యత కొత్త జీఎస్టీ ఫలాలను ప్రజలకు అందించే దిశగా చర్యలు తీసు కోలేకపోతున్నారు. జీఎస్టీ అమలు పై పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో వ్యాపా రులు ఇష్టారాజ్యంగా పాత ఎంఆర్‌పీలకే విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితి పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో కనిపిస్తోంది.

- ఇంకా పాత జీఎస్టీతోనే మందుల విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- అడిగితేనే కొత్త జీఎస్టీ అమలు
- సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ప్రచారానికే పరిమితం
- క్షేతస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తగ్గిన జీఎస్టీ ఫలాలు రోగులకు ఇంకా అందని ద్రాక్ష చందాన మారింది. కొన్ని రకాల మందులకు జీఎస్టీ పూర్తిగా రద్దయినా అది అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పుడు ప్రతి కుటుంబానికి మందులు ఓ నిత్యావసర వస్తువులా మారాయి. ప్రతి ఇంట్లో వృద్ధులు ఉన్నారు, అలాగే 50 ఏళ్ల పైబడిన వారిలో 50 శాతం మంది అలాగే షుగర్.. బీపీ.. గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులు నిత్యం ఔషధాలను వినియోగిస్తారు. జీఎస్టీ తగ్గింపుతో ఔషధాల ధరలు తగ్గాయని వినియోగదారులు ఆనంద పడుతుంటే కొందరు దుకాణదారులు వాటిపై పాత జీఎస్టీనే అమలు చేస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఇదేంటని అడిగిన వారికే తగ్గిన జీఎస్టీని అమలు చేస్తున్నారు. కొన్ని కార్పోరేట్ షాపులు కూడా ఇదే పంథాను అవలంబిస్తున్నాయి. అధికారులు జీఎస్టీ తగ్గిందని షాపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించి చేతులు దులుపుకుంటున్నారు తప్పిస్తే పూర్తి స్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. కొన్ని రకాల మందులకు 12, 18 శాతం జీఎస్టీ ఉండేది. ఆయా మందులకు 5 శాతం వరకు ప్రభుత్వం తగ్గించింది. కొన్ని రకాల మందులకు 6.25 శాతం, ఇంకొన్నిటికి 11.02 శాతం ఉంది. గతంలో కొన్ని రకాల మందులకు 12 శాతం, 5 శాతం జీఎస్టీ ఉంది. ఈ విభాగాల్లో జీఎస్టీని జీరోగా ప్రభుత్వం ప్రకటించింది. ఆయా రకాల మందులకు

(మిగతా 6వ పేజీలో)

ప్రచారానికే పరిమితం

జీఎస్టీ తగ్గింపు ప్రచారం ఓ పండుగలా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నా వాటి ఫలాలు ఇంకా వినియోగదారులకు అందుబాటులోకి రాలేదు. ఒక్కొక్క కుటుంబానికి అంత.. ఇంత ఆదా అయిందిని అధికారులు ప్రచారం చేస్తున్నారే తప్ప ఆచరణలో కానరావడం లేదు. పాత జీఎస్టీ కింద కొనుగోలు చేసిన మందుల నిల్వలు పూర్తిగా విక్రయించి కొత్త జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత మందులు కొనుగులు చేసే వరకు వ్యాపారులు పాత ఎంఆర్‌పీ ప్రకారమే విక్రయించనున్నారు. అయితే కొత్త జీఎస్టీ ప్రకారం మందుల విక్రయాలు జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, మందుల ధరలు తగ్గించాలని రోగులు కోరుతున్నారు.



● పర్చూరు వద్ద రూపుదిద్దుకున్న వాడరేవు - పిడుగురాళ్ల హైవే

హైవే.. రయ్‌రయ్

- శరవేగంగా 167ఏ నిర్మాణ పనులు
- వచ్చే నెల చివర్లో ప్రారంభానికి సన్నాహాలు
- ఆంధ్ర, తెలంగాణ ప్రయాణం సులభతరం

పర్చూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల ఎన్‌హెచ్- 167ఏ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ హైవేతో పల్లెలు, గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ఎన్‌హెచ్ - 167ఏ కోస్తా ప్రాంతానికి ముఖ్యంగా చీరాల, పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట తదితర పట్టణాలను అనుసంధానం చేస్తోంది. రూ.1064 కోట్లతో 85 కిలోమీటర్ల పొడవున దీనిని నిర్మిస్తున్నారు. ముఖ్యమైన బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు చాలావరకు పూర్తిచేసుకున్నాయి. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు, తద్వారా నకరికల్లు వరకు రెండు ప్యాకేజీలుగా విభజించి పనులు చేస్తున్నారు. వాడరేవు నుంచి చీరాల మండ లం ఈపూరుపాలెం వరకు 18 కిలో మీటర్ల మేర కొత్త రహదారిని నిర్మిస్తున్నారు. దీంతో చీరాల ప్రాంతానికి మరింతగా రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. ఈ రహదారితో రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. దీంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇదొక పెద్ద మైలురాయిగా మారే అవకాశాలున్నాయి. రవాణా సదుపాయంతోపాటు, ట్రాఫిక్ సమస్య కూడా తగ్గనున్నది. నవంబరు చివరి కల్లా పనులు పూర్తిచేసుకుని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జాతీయ రోడ్ల సమీక్షలో అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు కూడా చేశారు.

భూముల ధరలకు రెక్కలు...

నిన్నా మొన్నటి ఎకరం భూమి రూ.30 నుంచి 40 లక్షలకే పరిమితమైన భూములు నేడు రూ.కోటికి పైగా పలుకుతున్నాయి. హైవే పక్కన ఉన్న భూములకు గిరాకీ పెరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి పలువురు భూములను కొనుగోలు చేస్తున్నారు.



ఉప్పుటూరు మీదగా నిర్మించిన రోడ్డు

గూగుల్ టెక్ సంస్థ రావడం శుభపరిణామం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం రాష్ట్రానికి శుభపరిణామమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను తీసుకొచ్చి హైదరాబాద్‌ను ఏ విధంగా అభివృద్ధి చేశారో ఇప్పుడు విశాఖకు గూగుల్‌ను తీసుకొచ్చి రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చనున్నారని కొనియాడారు. రాష్ట్రానికి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ఆయన సమర్థవంతమైన నాయకత్వానికి తార్కాణమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో వచ్చిన పెట్టుబడులు కంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో వచ్చిన పెట్టుబడులే అధికంగా ఉన్నాయన్నారు. రాష్ట్రానికి రూ. 11.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 9.5 లక్షల ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు. గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందనున్నాయని యరపతినేని పేర్కొన్నారు.

శివాలయంలో బంగారం మాయంపై విచారణ

● ఆలయ అధికారి, అర్చకులతో ఆర్‌జేసీ సమావేశం

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో బంగారం మాయంపై రాష్ట్ర దేవాదాయశాఖ తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) చంద్రశేఖర్ ఆజాద్ విచారణ జరిపారు. మంగళవారం పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చిన ఆయన తొలుత ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్‌తో సమావేశమయ్యారు. ఆలయంలో అమ్మవారి వడ్డాణానికి సంబంధించి తగ్గిన బంగారం, మాయమైపోయిన బంగారపు వస్తువులు మొత్తం బరువు 30 గ్రాములు ఉంటుందని ఆయనకు తెలియజేశారు. దీంతో ఆర్‌జేసీ ఆలయ అర్చకులను పిలిపించి ఎలా జరిగిందని ప్రశ్నించారు. బాధ్యతగా ఉండాలని, అమ్మవారి బంగారు ఆభరణాలు మాయమైపోతుంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ ఘటన ఆగస్టులో వెలుగు చూస్తే ఇప్పటివరకు ఎందుకు కనుక్కోలేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని డీసీ లీలాకుమార్‌కు ఆదేశించారు. కొందరు అర్చకులు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆర్‌జేసీ పరిశీలనలో తేలింది. దీంతో ఆయన సమగ్ర విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.

కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలు

● అమ్మాయి ఫొటోతో ఫేస్‌బుక్ ఖాతా
● రైస్ మిల్ నిర్వాహకుడిని బెదిరించి రూ.కోటి కాజేత
● సంపాదించినదంతా క్రికెట్ బెట్టింగ్‌లో సమర్పణ

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలకు పాల్పడుతోన్న బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన చోడ చైతన్య కృష్ణ పవన్ (27) అనే నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. గుంటూరులోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన ఓ రైస్‌మిల్ నిర్వాహకుడికి ఆరు నెలల కిందట ఫేస్‌బుక్ మెసెంజర్‌లో శైలజ మార్ని పేరుతో నిందితుడు హాయ్ అని మెసేజ్ పెట్టాడు. కాల్ బాయ్‌గా వెళ్తే డబ్బులు వస్తాయని నిందితుడు చెప్పగా అందుకు బాధితుడు తన వయసు 68 సంవత్సరాలని, తనకు ఇష్టం లేదని స్పందించాడు. చివరకు బాధితునితో మాటలు కలిపి అతని పూర్తి వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత వేరే నంబర్‌తో ఫోన్లు చేసి తాము పోలీసులమనీ, నువ్వు మహిళలతో అసభ్యంగా చాట్ చేస్తున్నట్లు నీ మీద కేసు నమోదయిందని చెప్పాడు. కేసు నుంచి తప్పించడానికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని బెదిరించాడు. అలాగే మరో నంబర్‌తో బాధితుడుకి ఫోన్ చేసి తాము ఆదాయపన్నుశాఖ అధికారులమని, రైస్ మిల్లుపై రైడ్ చేయడానికి వస్తున్నామని చెప్పాడు. రైడ్ చేయకుండా ఉండాలంటే డబ్బులివ్వాలని బెదిరించాడు. ఇలా బెదిరించి అనేక దఫాలుగా బాధితుడిని భయపెట్టి రూ.కోటి వరకు కాజేశాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి ఐ ఫోన్‌తో సహా రెండు సెల్ ఫోన్‌లు, నాలుగు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కాగా బాధితుడు కొట్టేసిన నగదును ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టాడని చెప్పారు. బిహార్, యూపీ తదితర రాష్ట్రాల్లో అమాయకుల పేరుతో తప్పుడు ఖాతాలు సృష్టించి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, వాటిపై కూడా దృష్టి సారించి సొత్తు రికవరీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలు, స్నేహ అభ్యర్థనలు మొదలైన వాటికి స్పందించవద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా అనుమానంగా ఉన్నా, ఎవరైనా బెదిరింపులకు పాల్పడుతున్నా వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో గానీ, డయల్ 112 లేదా 1930 నంబర్లకు గానీ సంప్రదించాలని ఎస్పీ సూచించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పట్టాభిపురం సీఐ గంగా.వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్ కుమార్, ట్రైనీ ఎస్సై ప్రదీప్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావును, ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా, హెడ్ కానిస్టేబుల్ రాజా కిషోర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి వారికి ప్రశంసాపత్రాలు అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గూగుల్ డేటా సెంటర్‌తో కొత్త అధ్యాయం

● యువతకు ప్రపంచస్థాయిలో ఉద్యోగావకాశాలు ● చీఫ్ విప్ జీవీ

వినుకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా రూ.87,250 కోట్లతో గూగుల్ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్‌తో రాష్ట్రాభివృద్ధిలో కొత్త అధ్యాయం మొదలైందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గూగుల్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖను ఎంపిక చేసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. ఇది కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రానికి లభిస్తున్న గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం వినుకొండలో విలేకరులతో జీవీ మాట్లాడుతూ బ్రాండ్ ఏపీకి పెట్టుబడిదారులే ప్రచారకర్తలన్న విషయాన్ని సీఎం చంద్రబాబు మరోసారి నిజం చేసి చూపించారన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్, యాక్సెంచర్, సిఫీ, సత్వా, డబ్ల్యూఎన్ఎస్ లాంటి ప్రముఖ సంస్థలతో విశాఖ రూపురేఖలు మారబోతున్నాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా రాష్ట్రంలో కొత్త అధ్యాయం మొదలైందని, యువతకు పెద్దసంఖ్యలో ఉద్యోగావకాశాలు, భారీ పెట్టుబడులు, అత్యాధునిక టెక్నాలజీతో వ్యాపార వాతావరణం ఏర్పడనుందని పేర్కొన్నారు. 2029 నాటికి ఒక్క ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ శ్రమ, సమర్థత, నిబద్ధత వల్లే గూగుల్ ఒప్పందం ద్వారా దేశ చరిత్రలోనే అతిపెద్ద సింగిల్ ఎఫ్‌డీఐ సాధించామని పేర్కొన్నారు.

నకిలీ మద్యానికి తల్లి వేరు జగనే

● ఆ వృక్షాన్ని కూకటివేళ్లతో పీకేస్తాం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెలుగుచూసిన కల్తీ మద్యమనే మహావృక్షానికి తల్లివేరు జగన్ అయితే దాని పిల్లవేర్లు, ప్రధాన కొమ్మలు వైసీపీ నేతలు, వారికి సహకరించిన అధికారులని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ పిచ్చి వృక్షాన్ని కూకటివేళ్లతో సహా పెకలివేస్తుందని స్పష్టం చేశారు. ఏపీలో మొదలైన కల్తీమద్యం మూలాలు ఆఫ్రికా ఖండానికి చేర్చింది జగన్ క్రిమినల్ బుర్రేనని, కల్తీమద్యం ఘటనపై చంద్రబాబు నలుగురు ఐపీఎస్‌లతో సిట్ ఏర్పాటుచేసి, పాత్రధారులు, సూత్రధారుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మల్లాది విష్ణు బార్‌లో కల్తీమద్యానికి ఆరుగురు చనిపోయారని, అయినా అతన్ని పార్టీ నుంచి జగన్ సస్పెండ్ చేయలేదని అన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కల్తీమద్యంతో కావలిలో ఐదుగురిని బలితీసుకున్నా, వందలమందిని అనారోగ్యానికి గురిచేసినా జగన్ వారిని పల్లెత్తు మాట అనలేదని పేర్కొన్నారు. తన పాలనలోనే జంగారెడ్డిగూడెంలో కల్తీసారాకు 27 మంది బలైతే, అవన్నీ సహజమరణాలని అసెంబ్లీలో కట్టుకథలు చెప్పిన వ్యక్తి జగనని విమర్శించారు. దొంగ ప్రమాణాలు, బెదిరింపులతో చేసిన తప్పులు ఒప్పుకావనే నిజాన్ని వైసీపీనేత జోగి రమేశ్ గ్రహించాలని హితవు పలికారు.

ఏవోలు సిబ్బందికి మార్గదర్శకంగా ఉండాలి

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా
● ఉమ్మడి జిల్లాలో 11 మందికి పదోన్నతులు



ఏవోగా పదోన్నతి పొందిన కూచిపూడి మోహనరావుకు ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ క్రిస్టీనా, సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)లు కింది స్థాయి సిబ్బందికి మార్గదర్శకంగా ఉండాలని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. సమయపాలన పాటించటంతో పాటు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని 11 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు ఏవోలుగా ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీనియర్ అసిస్టెంట్‌లకు ఏవోగా పదోన్నతి అంటే మరింత బాధ్యత పెరిగినట్లేనన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతి బసు మాట్లాడుతూ ఏవోలు అవసరమయితే ఎంపీడీవో బాధ్యతలు కూడా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ మాట్లాడుతూ ఏవోలు మండల పరిషత్‌పై పట్టు సాధించాలని, లేకుంటే కిందిస్థాయి సిబ్బంది మాట వినరన్నారు. అనంతరం 11 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు ఏవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ మినిస్టీరియల్ సిబ్బంది రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూ ల్‌పాల్, ఏవోలు పూర్ణ చంద్రా రెడ్డి, రాజా రత్నం, మల్లేశ్వరరావు, సీసీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

30 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరో 30 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు డిప్యూటీ ఎంపీ డీవోలుగా పదోన్నతి లభించే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రక్రియను ఈ నెల 17 నాటికి పూర్తిచేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించడంతో అర్హులైన వారి జాబితాను జిల్లా అధికారులు సిద్ధం చేస్తున్నారు.

19న త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార సభ



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభను ఈ నెల 19న నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. 2025 ఏడాదికి గాను సుప్రసిద్ధ కవి, సాహితీ విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, రాజకీయ, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఈ పురస్కారాలు అందజేయనున్నట్టు వివరించారు. ఈ సభకు ముఖ్య వక్తలుగా ప్రముఖ సాహితీ విమర్శకుడు, కవి, జి.లక్ష్మీనరసయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొంటారని లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మూకిరి సుధ, శైలా జయసుధ, బి.విల్సన్ పాల్గొన్నారు.

ఆడవాళ్లందరూ తాగుబోతులే..!

● వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా వివాదాస్పద వ్యాఖ్యలు

వినుకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): "ఆడవాళ్లందరూ మందు తాగుతూ వారి ప్రవర్తనను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. ప్రజలూ తెలుసుకుంటున్నారు."అంటూ వినుకొండ వైసీపీ మాజీఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలంటూ వైసీపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వినుకొండలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల య్యాయి. బొల్లా మహిళలను తాగుబోతులంటూ కించపరచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలపై దిగజారుడు వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. బ్రహ్మనాయుడు వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని ఆయన తక్షణమే మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని, లేకుంటే మహిళా కమిషన్ విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. బొల్లా బ్రహ్మనాయుడి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం టీడీపీ నాయకులు, మహిళలు వినుకొండలో నిరసన వ్యక్తం చేశారు. బొల్లా బ్రహ్మనాయుడి ఫ్లెక్సీకి చెప్పుల దండ వేసి, ఆయనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి పెద్దఎత్తున నినదించారు. మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బొల్లాను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్రహ్మనాయుడు తన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకొని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షకీలా, తెలుగు మహిళలు, జనసేన వీర మహిళలు, బీజేపీ మహిళా నాయకులు పాల్గొన్నారు.



బొల్లా బ్రహ్మనాయుడు ఫ్లెక్సీకి చెప్పులు దండ వేసి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఔషధాలకు అమలేది!

(5వ పేజీ తరువాయి)

10.72 శాతం, 4.77 శాతం జీఎస్టీ తగ్గింది.

జీఎస్టీ తగ్గకముందు కొన్నవి ఉండటంతోనే: దుకాణదారులు

హోల్‌సేల్, రిటైల్ మందుల షాపుల వారు జీఎస్టీ తగ్గక ముందే మందులు కొనుగోలు చేశారు. ఆ నిల్వలు వ్యాపారుల వద్ద ఉన్నాయి. ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును గత నెల 22 నుంచి అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఉన్న నిల్వలు తక్కువకు అమ్మితే తాము నష్టపోతామని వ్యాపారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం కొత్త జీఎస్టీని అమలు చేయాల్సిందేనని ప్రకటించింది. మందుల కంపెనీలు జీఎస్టీ మారకముందు వ్యాపారులకు మందుల సరఫరా చేశాయి. అయితే మందుల ధరలు తగ్గించాలంటే కొనుగోలు చేసిన నిల్వలకు నష్టాన్ని ఎవరు భరిస్తారని దుకాణదారులు ప్రశ్నిస్తున్నారు. రిటైలర్ వద్ద పాత జీఎస్టీపై కొనుగోలు చేసిన మందులను తగ్గించి విక్రయిస్తే తాము నష్టపోతామని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్‌తోనే.. యూరియా

(5వ పేజీ తరువాయి)

పరిధిలో 215 మంది రైతులు ఉండగా గత రబీలో ఎక్కువ గా ఏ పంట సాగు చేశారన్న వివరాలు వ్యవసాయ శాఖ దగ్గర అందుబాటులో ఉన్నాయి. ఈ కేంద్రంలో యూరియాను అందు బాటులో ఉంచారు. రబీలో సాగు కోసం సన్నద్ధమైన రైతులను సేవా కేంద్రానికి పిలిపించి ఆధార్ అనుసంధానం, ఓటీపీ వస్తున్న తీరు, యాప్ పని చేస్తున్న విధానంపై అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నారు. అంతేకాక రైతుల నుంచి కూడా అభిప్రాయాలు సేకరిస్తున్నారు. పెదకాకానిలో ఈ విధానం విజయవంతం అయితే వచ్చే ఖరీఫ్‌కి రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానం ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

తెనాలిలో పట్టపగలు దారుణ హత్య

● మాస్క్‌తో స్కూటీపై వచ్చి కత్తితో దాడి చేసి పరార్
● కుటుంబ కలహాలే కారణమని పోలీసుల అనుమానం
● నిందితుడి కోసం గాలింపు



సంఘటన జరిగినప్రదేశం (ఇన్‌సెట్లో) మృతుడు తిరుపతిరావు (ఫైల్‌ఫొటో)

తెనాలి క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని చెంచుపేటలో పట్టపగలే దారుణ హత్య జరిగింది. కొబ్బరికాయల కత్తితో జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి (60) అనే వ్యక్తిని దారుణంగా నరికి చంపాడో దుండగుడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తు న్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి కొన్ని రోజులుగా చెంచుపేటలోని తన పెద్ద కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. గ్రామంలో 10 ఎకరాలకు పైగా కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే తిరుపతిరావు, పెదపూడి కో-ఆపరేటివ్ సొసైటీలో డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయనకు భార్య ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం ఉదయం పెద్ద కుమార్తె దుర్గ ఇంటి నుంచి టిఫిన్ తినడానికి బయటకు వచ్చిన తిరుపతిరావును స్కూటీపై మాస్క్ ధరించి వచ్చిన ఓ వ్యక్తి కొబ్బరికాయల కత్తితో నరికి పారిపోయాడు. పట్టపగలు రద్దీగా ఉన్న చోట హత్యకు పాల్పడటంతో ఆ ప్రాంతంలో ఉన్నవారు నిర్ఘాంతపోయారు. సమాచారం అందుకున్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ సాంబశివరావు, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి స్కూటీపై వెళుతున్న అనుమానాస్పద వ్యక్తిని గుర్తించారు. హతుని బంధువైన గండికోట వెంకటసుబ్బారావు పోలికలు ఉన్న వ్యక్తిగా బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

56,332 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 57,430 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 56,332 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,955 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10500	14000	నెంబరు. 5	10000	14500
341	10000	15500	341	10000	15600
4884	----	----	4884	10000	14000
సూపర్ 10	---	----	సూపర్ 10	10000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15200	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15800	దేవనూరు డీలక్స్	10500	14700
దేవనూరు డీలక్స్	10000	14800	తాలుకాయలు	5000	8000

గూగుల్‌తో ఒప్పందం కొత్త మైలురాయి : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్‌తో కుదుర్చుకున్న ఎంవోయూ రాష్ట్ర సాంకేతిక అభివృద్ధిలో కొత్త మైలురాయిగా నిలుస్తుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ దూరదృష్టి వల్లే ప్రపంచ దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గూగుల్ భాగస్వామ్యంతో రాష్ట్ర యువతకు ఐటీ రంగంలో వేలాదిగా ఉద్యోగాలు వస్తాయని అన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి, కర్నూలు వంటి నగరాలు ఐటీ హబ్బులుగా మారేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు. ప్రపంచస్థాయి సాంకేతిక శిక్షణ కేంద్రాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెక్యూరిటి రంగాలలో శిక్షణా అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ యువతకు గ్లోబల్ స్థాయి పోటీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా ప్రతి గ్రామానికి డిజిటల్ సదుపాయాలు విస్తరించనున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టెక్ హబ్‌గా మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర ప్రగతికి తోడ్పడాలని కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు.

ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశం కోసం ఐదవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు బీఎస్ఎస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 17వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఫోన్ నంబర్, నివాస అడ్రస్ తదితర వివరాలతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఐటిఐ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలు కోసం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఓ వైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మరోవైపు విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తున్నారన్నారు. 12 నెలలు పాటు శ్రమించి నేషనల్ పాలసీలలో కూడా మార్పులు చేయించి 2లక్షల మందికి ఉపాధి కల్పించి పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావటం అభినందనీయమన్నారు. దేశంలోనే 15 బిలియన్ డాలర్ల ఎఫ్‌ఐను సాధించటం ఇదే తొలిసారి అని నరేంద్రవర్మ అన్నారు. ప్రపంచంలోనే అమెరికా తర్వాత అతిపెద్ద, దేశంలోనే తొలి ఎఐ హబ్‌ను గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయబోతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వివిధ దేశాలకు నేరుగా కంప్యూటర్ డేటా పంపేందుకు బ్రాడ్ బ్యాండ్ వేగాన్ని పెంచేందుకు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటును గూగుల్ విశాఖలో ఏర్పాటు చేయనుందన్నారు. దేశం మొత్తం గర్వించే సంస్థ రాష్ట్రానికి వస్తే దేశవ్యాప్తంగా అందరూ ప్రశంసిస్తుంటే వైసీపీ నేతలు స్వాగతించకుండా గూగుల్ క్లౌడ్ సంస్థకు భూములు ఇవ్వకుండా అడ్డుపడి ఆ సంస్థపై కూడా తప్పుడు ప్రచారం చేసేందుకు కుట్రలు చేయటం దుర్మార్గమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు.

విషాద ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ● సముద్రంలో ఈత కొట్టటం నిషేధం



ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీరంలో ఈత కొట్టటం నిషేధమని, కేవలం స్నానాలు మాత్రమే ఆచరించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. చీరాల మండం ఓడరేవు సముద్రతీరంలో జరిగిన విషాద సంఘటన దృష్ట్యా మంగళవారం ఆయన మాట్లాడుతూ సముద్రతీరాలకు వచ్చే యాత్రీకులు పోలీసు శాఖ హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓడరేవు సముద్రతీరంలో జరిగిన విషాద సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు మరింత పటిష్ఠం చేస్తామన్నారు. గల్లంతైన కూచిన షారోను రాజు మృతదేహం ప్రకాశం జిల్లా నాగుల్బులపాడు మండలం కనపర్తి గ్రామ పరిధిలోని సముద్రతీరంలో మంగళవారం మధ్యాహ్నం పోలీసు అధికారులు గుర్తించారని తెలిపారు. చీరాల ప్రభుత్వ వైద్యశాలలో శవపంచనామా అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నామని చెప్పారు. సముద్రతీరాలకు విహార యాత్రకు వచ్చే యాత్రీకులు తప్పనిసరిగా హెచ్చరికలు పాటించాలన్నారు. సూచించిన ప్రదేశాలలోనే స్నానాలు ఆచరించాలన్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ గుర్తించేందుకు సుమారు రెండురోజులపాటు నిర్విరామంగా కృషి చేసిన పోలీసు, ఫైర్, మెరైన్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ సీమౌత్ దగ్గర సర్వే పూర్తి

● కలెక్టర్‌కు సమర్పించనున్న నివేదిక



ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా, సీఐ శ్రీనివాసరావు, సర్వేయర్ లక్ష్మీనారాయణ

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాలతో అధికార యంత్రాంగం అడవిపంచాయతీ పరిధిలో ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ సముద్రంలో కలిచే ప్రాంతానికి కదిలి వెళ్లారు. గత రెండు రోజులుగా ఆర్డీవో పి.గ్లోరియా ఆధ్వర్యంలో ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ డ్రైన్ సముద్రంలో కలిసే ప్రాంతంలో మంగళవారం సర్వే చేశారు. ఆ ప్రాంతంలో డ్రైనేజి విస్తీర్ణం, పట్టాభూమి, డీకెభూమిని పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు గుర్తించారు. మత్స్యకారులు, రైతుల సమక్షంలో సర్వే చేయటం జరిగింది. డ్రైనేజి పొంగి పొర్లి తన భూమి కోతకు గురైందని రైతు, పడవలు కాల్వలో నుంచి సముద్రంలోకి వెళ్ళే సమయంలో బుర్ల వెంకట్రావు అనే రైతు కాల్వలో వేసిన కొండరాళ్ళ వల్ల పడవలు దెబ్బతింటున్నాయని మత్స్యకారులు అధికారులకు వివరించారు. అయితే అక్కడ వాస్తవ పరిస్థితిని సర్వే ద్వారా గుర్తించారు. దీనికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, సీఐ శ్రీనివాసరావు, సర్వేయర్ లక్ష్మీనారాయణ, డ్రైనేజి డీఈ మురళి కృష్ణ, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

గజ ఈతగాళ్ళు అప్రమత్తంగా వ్యవహరించాలి : తహసీల్దార్

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సముద్రతీరానికి వచ్చే పర్యాటకులు, భక్తుల భద్రత దృష్ట్యా గజఈతగాళ్ళు అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ షేక్ సలీమా తెలిపారు. ఆమె మంగళవారం ఎంపీడీవో బాబురావుతో కలిసి సూర్యలంక తీరాన్ని సందర్శించారు. అక్కడ మండల పరిషత్, రెవెన్యూ సిబ్బందితో కలిసి గజ ఈతగాళ్ళకు, పర్యాటకులకు పలు సూచనలు చేశారు. సముద్రస్నానం చేసేవారు లోతుకు వెళ్ళకుండా మైక్‌లో ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేయాలన్నారు. నడుం లోతుకు మించి వెళ్ళవద్దని పర్యాటకులకు చెప్పాలన్నారు. సముద్ర తీరంలో ఏ ఒక్క ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గజఈతగాళ్ళు నిత్యం గస్తీ నిర్వహించాలని చెప్పారు.

అంతర్‌కళాశాలల క్రీడా పోటీలలో బీఈసీ విద్యార్థుల ప్రతిభ


బాపట్లరూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో అంతర్ కళాశాలల క్రీడాపోటీలలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి బహుమతులను సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు డిసెంబరు నెలలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావటంపై బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగణంలో బహుమతులు సాధించిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగాసనాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పీఈడీ వరుణ్‌రాజు, టి.శ్రావణి ప్రథమస్థానం కైవశం చేసుకోవటంతోపాటు మరో విద్యార్థిని పి.శ్రావ్య తృతీయ బహుమతిని సాధించటం జరిగిందన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించటంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ జాయింట్ సెక్రటరి దొడ్డపనేని వెంకయ్య చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు

ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్స్ ఏర్పాటుపై రైతులకు శిక్షణ

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయకళాశాల క్షేత్రంలోని పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ కేంద్రంలో రైతులకు ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్స్ నెలకొల్పటంలో మెళకువలు అనే అంశంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణకు రేపల్లె, చెరుకుపల్లి గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యారు. ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఏడుకొండలు, రేపల్లె ఏడీఏ ఎ.లక్ష్మీ, అగ్రికల్చర్ ఆఫీసర్ మహేష్‌బాబులు పాల్గొని రైస్‌మిల్లింగ్ చేసే చిన్నయంత్రం, అపరాలు ప్రాసెసింగ్ చేసే యంత్రం, నూనె తీసే యంత్రం, మిరప కంప్యాక్షన్ యంత్రం, సోలార్‌బబుల్ డ్రయ్యర్ ఇలా వివిధ యంత్రాలను డెమో ద్వారా రైతులకు చూపించారు. ఇందులో క్షేత్ర నేచరల్స్ ఫార్మా ప్రొడ్యూస్ కంపెనీ వ్యవస్థాపకులు వెంకటరమణ తన సక్సెస్ స్టోరీ రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్‌రాజా, డాక్టర్ వాసుదేవరావు పాల్గొని రైతులకు శిక్షణనిచ్చారు.



బాపట్ల పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్‌లో శిక్షణకు హాజరైన రైతులతో శాస్త్రవేత్తలు

వ్యవసాయ రంగానికి అత్యధిక రుణాలివ్వాలి

● బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంపై ఆధారపడిన జిల్లా రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి బ్యాంకర్‌ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అత్యధిక రుణాలివ్వాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాలకు కలిపి 15,820 కోట్ల రూపాయలు రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న విషయాలను ఆయన ప్రస్తావించారు. వ్యవసాయ రంగానికి రూ.12,080 కోట్ల రుణాలివ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం రూ.3,472 కోట్లు మాత్రమే రుణాలివ్వటం ఏమిటని ప్రశ్నించారు? అర్థ సంవత్సరం గడిచినప్పటికి కేవలం 28.74 శాతం పురోగతి సాధించటం ఏమిటని ఆరా తీశారు. వార్షిక ప్రణాళికను బ్యాంకర్‌లు విస్మరించరాదన్నారు. అభివృద్ధిలో బ్యాంకర్‌ల సహకారం ఉండాలన్నారు. అన్నిటిలో జిల్లాను మూడో స్థానంలో నిలిపేలా సహకరించాలని కోరారు.

● కౌలు రైతులకు రుణాలివ్వకపోవటం మంచిపద్ధతికాదని కలెక్టర్ తెలిపారు. 8 వేల మంది కౌలు రైతులకు రూ.100కోట్లు రుణాలివ్వాలని లక్ష్యం కాగా 2,326 మంది కౌలు రైతులకు రూ.8.80 కోట్లు రుణాలివ్వటం ఏమిటని ఆరాతీశారు. పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు పెట్టుబడులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే ఎందుకు పట్టించుకోవటంలేదని బ్యాంక్ అధికారులను ప్రశ్నించారు. బ్యాంకర్లు సహకరించకపోతే పంటలు ఎలా సాగు చేస్తారన్నారు. కౌలురైతులపై చులకనభావం విడిచిపెట్టాలన్నారు. ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్‌లో 15రోజులలో ఏటీఎం ఏర్పాటు చేయాలన్నారు.

● ఆర్థిక సంవత్సరంలో రూ.1291 కోట్ల రుణాలతో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం 37.15 శాతం మాత్రమే పురోగతి సాధించటం ఏమిటన్నారు. కేవలం రూ.479.75 కోట్ల రుణం ఇస్తే లక్ష్యాలు ఎప్పుడు చేరుకుంటారో బ్యాంక్ అధికారులు పరిశీలించాలన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్‌ల కమిటీ సమావేశం తీసుకున్న నిర్ణయాలు అమలు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కన్వీనర్ సోమేశ్వరరావు, ఎల్‌డీఎం శివకృష్ణ, ఆర్‌బీఐ ఎల్‌డీవో గిరిధర్, అన్ని బ్యాంక్ మేనేజర్‌లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖనిజ సంపద నిధి చట్టబద్ధంగా అమలయ్యేలా చర్యలు

ఖనిజ సంపద నిధి చట్టబద్ధంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. డీఎంఎఫ్ (ఖనిజ సంపద నిధి) జిల్లా కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఖనిజ సంపద కింద చిన్న, పెద్ద గ్రానైట్ క్వారీలు, ఇసుక క్వారీలు నుంచి చట్టబద్ధంగా సీనరేజ్ ద్వారా ఖనిజ సంపద నిధి సేకరించాలని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 51.22 కోట్ల రూపాయల నిధి ఉందన్నారు. మార్చి నాటికి మరో 4 కోట్ల రూపాయలు సీనరేజ్ వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాకు వచ్చే ఖనిజ సంపద నిధిని జిల్లా అభివృద్ధికి వినియోగించాలన్నారు. ప్రస్తుతం రూ.48.68 కోట్లతో అభివృద్ధి పనులు చేయటానికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. 42 పనులు చేయటానికి అధికారికంగా అనుమతులు జారీ చేసినట్లు వివరించారు. డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులన్ని నవంబరు 15వ తేదీలోగా వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్ మైన్స్ డీడీ రామచంద్ర, కమిటీ సభ్యులైన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా సహకార సంఘాలు పనిచేయాలి

సహకార సంఘాల ఆధీనంలో జరుగుతున్న ఎరువుల విక్రయాలలో అవకతవకలు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రైతు ఉత్పత్తి సంఘాలు, సహకారసంఘాల పనితీరుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు రైతులందరికి అందుబాటులో ఉంచాలని సూచించారు. యూరియా కొరత లేకుండా సమర్థవంతంగా పనిచేయాలని చెప్పారు. వ్యవసాయ, మత్స్యశాఖ, సహకార శాఖ ఆధీనంలో నడుస్తున్న సహకార సంఘాల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సహకార శాఖ ఆధీనంలో 14 కోట్ల రూపాయలతో గోదాములు నిర్మిస్తున్నట్లు చెప్పారు. నిర్మిస్తున్న 35గోదాములు 15రోజుల్లో పూర్తి చేసి అప్పగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకారశాఖాధికారి శ్యామసన్, వ్యవసాయశాఖ జెడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మత్స్యశాఖ జెడి శ్రీనివాస్‌నాయక్, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో జిల్లా పురోభివృద్ధికి కృషి చేయాలి

అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లా పురోభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం పంచాయతీ, మున్సిపాలిటి విభాగాల పనులపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీలలో తడి, పొడి చెత్త సేకరణలో ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా, వారానికి కనీసం రెండురోజులు మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణలో వెనుకబడి ఉన్న 10 పంచాయతీలకు కాషన్‌నోటీసులు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంలో జిల్లా12వ స్థానంలో ఉందని దానిని మూడో స్థానానికి తీసుకురావాలని తెలిపారు. గ్రామాలలో స్వామిత్వ కార్యక్రమాల అమలపై కలెక్టర్ ఆరా తీశారు. బాపట్ల మండలం వెనుకబడి ఉందని ఆయన తెలిపారు. దీనిని నూరుశాతం పూర్తి చేయాలన్నారు. నాలుగు మున్సిపాలిటిల కమిషనర్‌లకు పలుసూచనలు చేశారు. బాపట్ల మున్సిపాలిటిలో 12 కమ్యూనిటి టాయిలెట్‌ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయటమైనదన్నారు. ఈ సమావేశంలో డీపీవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యుఎస్‌సి అనంతరాజు,హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఏ పీడీ లవన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలువార్డులలో మంగళవారం ఉదయం కమిషనర్ జి.రఘునాథరెడ్డి విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. జీబీసీ రోడ్డులోని బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్, ప్రధాన రోడ్ల వెంట పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించారు. 1వ వార్డు బేతనీకాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 3వ వార్డులో నీటి సరఫరాను పరిశీలించారు. రాజీవ్‌గాంధీకాలనీలో చెరువుపూడిక పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఎస్‌ఎస్‌ఆర్ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గో ఆశ్రమానికి గోవులను తరలిస్తాం

పట్టణంలోని రహదార్లపై ఆవుల సంచారం అధికంగా ఉండటం వల్ల వాహనచోదకులకు ఆటకంకంగా మారి ప్రమాదాలు జరగటమే కాకుండా పారిశుధ్యానికి ఇబ్బందికరంగా ఉండటంతో ప్రకటించిన ప్రకారం వాటిని పట్టుకొని మున్సిపల్ అధికారుల సంరక్షణలో ఉంచటం జరిగిందని కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఆవుల యజమానులు వచ్చి తీసుకెళ్ళకపోవటం వల్ల వాటిని బుధవారం గోఆశ్రమానికి తరలిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు.

రెవెన్యూ సమస్యలు నాణ్యతతో పరిష్కరించాలి : డీఆర్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలు నాణ్యతతో పరిష్కరించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. పీజీఆర్‌ఎస్ వినతుల పరిష్కారంపై వీఆర్వోలకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో నమోదయ్యే అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి పద్ధతి ప్రకారం పరిష్కరించాలన్నారు. ఐవీఆర్‌ఎస్ సర్వేలో ప్రజలు నుంచి అసంతృప్తి వ్యక్తం చేసిన వీఆర్వోలను పిలిపించమన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి లవన్న, సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనవిభాగం పర్యవేక్షకులు షేక్ షఫి, వీఆర్వోలు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో భూసారం పెంపొందుతుంది : అచ్యుతరాజు

కర్లపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవన ఎరువులతో భూసారం పెంపొంది అధిక దిగుబడులను సాధించవచ్చని బాపట్ల ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె. అచ్యుతరాజు అన్నారు. కర్లపాలెం శాఖా గ్రంథాలయం వద్ద ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జీవన ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీవన ఎరువులు వాడటం వల్ల పంటలో బ్యాక్టీరియా, ఫంగస్ తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కదిరి బాబురావు, కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ ప్రతిభ ఉపకార వేతనం పొందటానికి కృషి చేయాలి

కర్లపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ ఉపకార వేతనం పొందటానికి విద్యార్థులు కృషి చేయాలని కర్లపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.విజయశ్రీ అన్నారు. జాతీయ ప్రతిభ ఉపకార వేతనం పోటీపరీక్షలకు సిద్ధమౌతున్న ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు సహకారంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కార్యకమంలో యూటీఎఫ్ మండల నాయకులు ఇనకొల్లు పోలీసురావు, ప్రైమరీ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, బి.రాజేష్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్, రాజేష్, ఉదయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నకాలనీలలో మౌలిక వసతులు కల్పించాలి : సీపీఎం

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు నీటమునిగిన గంగపుత్రకాలనీ, బేతనీకాలనీ, ప్యాడిసన్‌పేట జగన్నకాలనీలలో మౌలికవసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. భారీ వర్షంతో నీటమునిగిన కాలనీలను మంగళవారం ఆయన పార్టీశ్రేణులతో కలిసి పరిశీలించారు. ఆయా కాలనీలలో మౌలికవసతులు కల్పించాలని లేనిపక్షంలో సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్, లోకేష్, భాగ్యలక్ష్మి, సల్మా, మునీకుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

చుండూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు జరిపించుకోవడం చట్ట ప్రకారం నేరమని వేటపాలెం పీహెచ్‌సీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి పోలే కోటేశ్వరరావు తెలిపారు. వలివేరులో అంతర్జాతీయ బాలికల వారోత్సవాల సందర్భంగా మంగళవారం గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొందరు మగ పిల్లవాడే కావాలనే ఉద్దేశ్యంతో లింగ నిర్ధారణ పరీక్షల వైపు ఆసక్తి చూపుతున్నారని, ఈ పరీక్షలు నిర్వహించడం, పరీక్షలు చేయించుకోవడం చట్టం ప్రకారం నేరం, మూడు సంవత్సరాల జైలు, రూ.10 వేలు జరిమానా విధించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నూతలపాటి పార్వతి, లక్ష్మి, దేవకుమారి, పోలేరమ్మ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్కాట్ బాల్ టోర్నమెంట్‌లో బంగారు పతకాలు

కొల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్కాట్ బాల్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ఫోర్ ఫంట్ ఇంటర్నేషనల్ విద్యా సంస్థ డైరెక్టర్ నవీన్‌పాల్, ప్రిన్సిపల్ అనితకుమారి రాజన్ మంగళవారం తెలిపారు. మంగళగిరిలో జరిగిన ఏరో స్కేటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో తమ విద్యా సంస్థ నుంచి గరిక రుత్విక్, మునిపల్లి పునీత్‌లు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను డీఎస్పీ జనార్ధనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందించాలి

కొల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామన్న రూ.20 వేల నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కొల్లూరులోని రెవెన్యూ అధికారులకు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో తోడేటి సురేష్ మంగళవారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త కౌలు చట్టాన్ని తీసుకురావాలని, గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములకు కూడా పంట రుణాలు, అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం సభ్యులు జంపాని వెంకటప్రసాద్, గొరికపూడి కోటయ్య, మునిపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై సాంస్కృతిక కళా ప్రదర్శన

బాపట్ల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై సాంస్కృతిక కళాప్రదర్శన మంగళవారం రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, జానపదనృత్యాల ద్వారా అలరింపచేశారు. అనంతరం కమిషనర్ కళాకారులను సన్మానించి మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండి.సాధిక్, నృత్య గురువు రవళి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు మహావీరారెడ్డి ఎంపిక

పిట్టలవానిపాలెం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సమ్మెట మహావీరారెడ్డి ఎంపికయ్యారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న సమ్మెట మహావీరారెడ్డి స్కూల్ గేమ్స్ అండర్ -19 బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.ప్రశాంత్‌బాబు మంగళవారం తెలిపారు. ఈపోటీలకు ఎంపికైన మహావీరారెడ్డిని, కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.ప్రశాంత్‌బాబును పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-2 కె.రాజారత్నం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి-1 కె.శివబాబు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సినీపాటల వెల్లువ జాలాది, సాయిశ్రీహర్ష

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సినీపాటల రచయితలు జాలాది 14వ వర్ధంతి, శ్రీహర్ష 15వ వర్ధంతి కార్యక్రమాలను బాపట్ల సాహితిభారతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, సాహితిభారతి ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్, గ్రోసంస్థ అధినేత, రచయిత బందా బాబు, కాళీదాసు, శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, ఎం.జాకబ్ పాల్గొన్నారు.

దీపావళి దుకాణాదారులు అనుమతులు తీసుకోవాలి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. అన్నిశాఖల అధికారులతో దీపావళి పండుగ సందర్భంగా మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ఏర్పాటుచేసే దుకాణాల వద్ద తప్పనిసరిగా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, ఫైర్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడా అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సమన్వయంతో షాపులను ఒకటికి రెండుసార్లు తనిఖీలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహనరావు

పేలవంగా మండల పరిషత్ సమావేశం

● సభ్యులు 29 మందిలో పది మంది హాజరు
● జడ్పీటీసీ గైర్హాజరు ● ఇరిగేషన్ శాఖపైనే చర్చ

వేమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం పేలవంగా సాగింది. పరిషత్ అధ్యక్షుడు యల్లమాటి మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 17 మంది సర్పంచ్‌లకు గాను నలుగురు, 12 మంది ఎంపీటీసీలలో ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. జడ్పీటీసీ గైర్హాజరు అయ్యారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కో-ఆప్షన్ సభ్యుడు సువర్ణబాబుకు సంతాపం తెలిపారు. అనంతరం ఎంపీడీవో పి.రవికుమార్ శాఖల వారీగా సమీక్ష ప్రారంభించారు. గంటకు పైగా జరిగిన సమావేశంలో సభ్యులు ఇరిగేషన్ శాఖకు సంబంధించిన సమస్యలపైనే మాట్లాడారు. సంబంధించిన సమస్యలకు ఆ శాఖ అధికారులు సరైన సమాధానాలు ఇవ్వలేకపోవడంతో సభ్యులు నిరాశ చెందారు. ఇతర శాఖలకు చెందిన అధికారులు, ఆయా శాఖల సంబంధమైన పథకాలు అమలు విషయాన్ని వివరించారు. హాజరైన ఎంపీటీసీలు తమకు సంవత్సర కాలం నుంచి గౌరవ వేతనం అందడం లేదని వాపోయారు. ఎంపీడీవో మాట్లాడుతూ, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం సర్పంచ్‌లకు, ఉపసర్పంచ్‌లకు, గురువారం క్లాప్‌మిత్రాలకు, శుక్రవారం యానిమేటర్లకు శిక్షణ నిర్వహిస్తామన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ఒక్కరోజు శిక్షణ

చెరుకుపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఎస్‌డీజీ థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్‌పై మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ట్రైనింగ్‌లో భాగంగా డీఎల్‌పీవో శ్రీనివాసన్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల హక్కులు, పారిశుధ్య నిర్వహణపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాల్సిన బాధ్యతలు, చర్యల గురించి వివరించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదు

● సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధుల ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాంచారమ్మ

కొల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం కూడా తమకు ఇవ్వడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు ఆరోపించారు. కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు ప్రొటోకాల్ పాటించడం లేదని, ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకపోగా కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులపై ధ్వజమెత్తారు. మండల గ్రామాల్లో ఆర్ అండ్ బీ రోడ్లు, పంచాయితీరాజ్ రహదారులు అధ్వానంగా ఉన్నా వాటి గురించి సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. సమావేశం సాదాసీదాగా ముగించారు. ఎంపీడీవో నరసింహారావు, జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట కోతపై రైతులు అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మి

రేపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులు కోతల అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ఎ.లక్ష్మి అన్నారు. పేటేరు గ్రామంలో రైతులకు వ్యవసాయసాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మావారి సౌజన్యంతో పంటకోత సాంకేతిక పరిజ్ఞానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటకోతకు నూతన పరికరాలు, వాటి ఉపయోగాలను రైతులకు సూచించారు. రైతులకు ఉపయోగపడే మినీ రైస్ మిల్ అవసరాల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ ఏవో మహేష్‌బాబు, వీఏఏలు రాయల్‌బాబు, శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఏడుకొండలు పాల్గొన్నారు.

చుండూరులో విద్యుత్ విజిలెన్స్ బృందాల ఆకస్మిక తనిఖీలు

చుండూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 18 గ్రామాలలో విద్యుత్ శాఖ విజిలెన్స్ బృందాలు మంగళవారం విద్యుత్ మీటర్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 65 బృందాలు కలిసి 5300 సర్వీసులను పరిశీలించారు. ఇందులో 248 కమర్షియల్ కేటగిరికి చెందిన వాటిలో 34 సర్వీసులు అదనపు లోడ్‌లో ఉండటం గుర్తించి వాటిపై రూ.1.27 లక్షల అపరాధ రుసుం విధించారు. మీటరు లేకుండా విద్యుత్ వాడుతున్న రెండు సర్వీసులకు రూ.4 వేలు, శాంక్షన్ కేటగిరి నుంచి ఇతర అవసరాలకు వాడుతున్న 8 సర్వీసులపై రూ.32 వేలు అపరాధ రుసుం విధించినట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. విజిలెన్స్ దాడులలో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆంజనేయులు, డివిజన్ విజిలెన్స్ ఇంజనీర్ భాస్కర్, బాపట్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్, రాజశేఖర్ బాబు, ఏఈ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎక్సైజ్ సురక్ష యాప్ లిక్కర్ మాత్రమే స్కాన్ చేస్తుంది'

బాపట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ సురక్ష యాప్ కేవలం లిక్కర్‌ను మాత్రమే స్కాన్ చేస్తుందని, బీర్‌లకు స్కాన్ అవ్వదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. క్యూఆర్ కోడ్ కలిగిన లేబుల్స్ మద్యం సీసాలపైనే ఉంటుందన్నారు. బీర్ బాటిల్స్‌పైన ఉండదన్నారు. సదరు క్యూఆర్‌కోడ్ మద్యం తయారు చేసిన కంపెనీలవి మాత్రమేనన్నారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించినవికావని ఆయన వివరించారు.

బహిరంగంగా ధూమపానం చేస్తే చర్యలు

బాపట్ల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆర్.రాంబాబు హెచ్చరించారు. పట్టణంలో మంగళవారం సిబ్బందితో కలిసి సీఐ రైల్వేస్టేషన్, బస్టాండ్, పరిసర ప్రాంతాలలో బహిరంగంగా ధూమపానం చేస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ మద్యపానం, ధూమపానం చేయరాదన్నారు.

శివకాశీ టూ గుంటూరు

● దీపావళి బాణసంచా అక్రమ రవాణాపై కొరవడిన నిఘా ● కనిపించని అధికారుల తనిఖీలు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రానున్న దీపావళికి బాణసంచా విక్రయాలకు కొందరు వ్యాపారులు అడ్డదారులు దొక్కుతున్నారు. ఎటువంటి నిబంధనలు పాటించకుండా అక్రమంగా బాణసంచా తీసుకొచ్చి వ్యాపారం చేసి సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కోట్ల రూపాయల బాణసంచా అక్రమ పద్ధతిలో తరలివస్తోన్నా వాణిజ్యపన్నులశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్న దాఖలాలు కనిపించకపోవటం విమర్శలకు తావిస్తోంది. బాణసంచా తయారీకి కీలక కేంద్రమైన తమిళనాడులోని శివకాశి నుంచి కొందరు వ్యాపారులు భారీ ఎత్తున సరకు రవాణా చేస్తున్నారు. కొందరు అక్రమ పద్ధతిలో మరికొందరు ఎటువంటి బిల్లులు లేకుండానే అనధికారికంగా బాణసంచాను వాహనాలలో గోడౌన్‌లకు తరలిస్తున్నారు. శివకాశి నుంచి నేరుగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు బాణసంచా అక్రమ పద్ధతిలో తరలివస్తున్నా వాణిజ్యపన్నులశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాచర్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, అమరావతి, చిలకలూరిపేట, మంగళగిరి, గుంటూరు వంటి ప్రాంతాల్లో బాణసంచా విక్రయ కేంద్రాలు పెద్ద ఎత్తున వెలిశాయి. దీపావళి సందడి మాటున అక్రమ రవాణాలో ఎటువంటి బిల్లులు లేకుండానే కోట్లాది రూపాయల సరుకు రవాణా అవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



● నిబంధనలు హుష్...!

ఇక బాణసంచా హోల్‌సేల్ విక్రయాల్లో దుకాణదారులు నిబంధనలు పాటించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పండుగ రోజు విక్రయాలు చేసేందుకు చిల్లర వర్తకులు హోల్‌సేల్ వ్యాపారుల నుంచి బాణసంచా కొనుగోలు చేస్తుంటారు. పండుగ సమీపిస్తుండటంతో ఇప్పటికే పెద్దఎత్తున బాణసంచా కొనుగోలు చేశారు. వారికి ఎంత వరకు బిల్లులు ఇస్తున్నారో తెలియడం లేదు. దీనిపై కనీసం అధికారులు తనిఖీలు చేసిన సందర్భాలు కూడా లేకపోవటం అనేక విమర్శలకు తావిస్తోంది. అయితే బాణసంచా విక్రయాలు 18 శాతం జాబితాలో ఉండటంతో ఆ దిశగా ఎంత వరకు క్రయవిక్రయాలు జరుగుతున్నాయన్న లావాదేవీలపై వాణిజ్యశాఖ అధికారులు దృష్టి సారించాలని వినియోగదారులు కోరుతున్నారు.

గడ్డిపూలు.. కనువిందు



పాలపాడు రహదారిలో చిలకలూరిపేట మేజర్ కాల్వ కట్టపై గడ్డిమొక్కలకు పూసిన పూలు కనువిందు చేస్తున్నాయి. ఈ పూలతో కాల్వ గట్టు తెలుపు వర్ణంతో శోభిల్లుతుంది.

-ఆంధ్రజ్యోతి, నరసరావుపేట

వైద్య కళాశాలకు బస్సు విరాళం

గుంటూరు మెడికల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల సామాజిక వ్యాధి నిరోధక శాస్త్రవిభాగానికి రూ.30 లక్షల విలువైన బస్సును విరాళంగా అందజేసేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎంసీ బ్రాంచ్ ఆమోదం తెలిపింది. మరో వారం రోజుల్లో ఈ బస్సును జీఎంసీకి అందజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖ అధికారులను కలసి వైద్య విద్యార్థుల కోసం బ్యాంక్ తరఫున బస్సును విరాళంగా అందజేయాలని కోరారు. వీరి అభ్యర్థన పట్ల బ్యాంక్ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. రూ. 30 లక్షలతో నూతన టాటా స్టార్‌బస్ ప్రైమ్‌ను కొనుగోలు చేశారు. దీనిని త్వరలో ఎస్‌పీఎం విభాగానికి అందజేస్తారు. ఇదే రీతిలో వైద్య కళాశాలలోని గార్డెన్స్‌లో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు కూడా యూనియన్ బ్యాంక్ అధికారులు ఆమోదం తెలిపారు. ప్రభుత్వాసుపత్రి న్యూరాలజీ విభాగంలోని స్లీప్ ల్యాబ్‌లో అవసరమైన రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను విరాళంగా అందజేసేందుకు మరో బ్యాంక్ ముందుకొచ్చినట్లు తెలిసింది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జీఎంసీకి ఈ విరాళం అందజేసేందుకు సదరు బ్యాంక్ అధికారులు ఆమోదం తెలిపినట్లు సమాచారం. కళాశాలకు


● త్వరలో అందజేయనున్న యూనియన్ బ్యాంకు

వచ్చే వయో వృద్ధులు, దివ్యాంగులను దృష్టిలో ఉంచుకొని వారి కోసం ఆవరణలో నడిపేందుకు బగ్గీ వంటి మినీ మోటారు వెహికల్‌ను రూ.4 లక్షల వ్యయంతో కొనుగోలు చేసి విరాళంగా అందజేసేందుకు మరో సంస్థ ముందుకొచ్చింది. కాగా, రూ.40 లక్షల వ్యయంతో వైద్య కళాశాలలో చేపట్టిన క్యాంటీన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఈ వారంలో దాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ తెలిపారు. ఇదిలా ఉంటే వైద్య విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కళాశాల ఆవరణలోనే కొత్తగా కో ఆపరేటివ్ స్టోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.


ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న
వరద ఉధృతి

దిగువకు 1,03,350 క్యూసెక్కుల నీటి విడుదల

తాడేపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగు తోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 1,15,971 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 1,03,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 7,431 క్యూసె క్కులు, పశ్చిమ డెల్టాకు 5,009 క్యూసెక్కులు, గుంటూరు చానల్ కాలువకు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు




సాగర్‌లో 4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో అధికారులు మంగళవారం నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయ నీటిమట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7,190 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,657 క్యూసెక్కులు, 4 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 32,316 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 84,403 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 84,403 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టెయిల్‌పాండ్ నుంచి 69,616 క్యూసెక్కుల నీటి విడుదల

రెంటచింతల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ నుంచి 69,616 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. టెయిల్‌పాండ్‌కు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 4 గేట్లను 2.5 మీటర్లు, ఒక గేట్‌ను 2 మీటర్ల మేర ఎత్తి 61,196 క్యూసెక్కులు.. విద్యుదుత్పత్తి అనంతరం టెయిల్ రేస్ చానల్ ద్వారా 8,420 క్యూసెక్కులు మొత్తంగా 69,616 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేసినట్లు వారు చెప్పారు. సోమవారం వరకు రెండు యూనిట్ల ద్వారా 0.9988 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 66,014 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని చెప్పారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని తెలిపారు.

టెయిల్‌రేస్ చానల్ ద్వారా విడుదలవుతున్న నీరు



దేశంలో జీఎస్‌టీ సంస్కరణలు విప్లవాత్మకం

● మాజీ కమిషనర్ జాన్సన్

ఏఎన్‌యూ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత ఆర్థిక వ్యవస్థలో జీఎస్‌టీ సంస్కరణలు విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయని తమిళనాడు మాజీ ఆదాయపు పన్ను కమిషనర్ జాన్సన్ వెల్లడించారు. ఏఎన్‌యూ వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో జీఎస్‌టీ 2.0- సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్ అనే అంశంపై మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాన్సన్ మాట్లాడుతూ భారత పన్ను వ్యవస్థ చారిత్రాత్మక పరిణామమని, ప్రాచీన వాణిజ్య సుంకాల నుంచి ఆధునిక జీఎస్‌టీ పన్ను నిర్మా ణాలు ఎంతో కీలకమని చెప్పారు. విద్యార్థులు పన్ను విధానం గురించి అవగాహన పెంచుకోవాలని వివరించారు. జీఎస్‌టీ పన్ను విధానం పారదర్శకతతో పాటు సరళీకృత ఆదాయ సామర్థ్యాన్ని పెంచుతుందని అన్నారు. డిజిటలైజేషన్ పన్ను విధానం పరిపాలనలో కీలక మార్పులను తీసుకువచ్చిం దని జాన్సన్ పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఏఎన్‌యూ తాత్కాలిక రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు పన్ను విధానంలోని పరిణామాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను మాజీ కమిషనర్ జాన్సన్

ఎన్‌సీసీ బలోపేతానికి కృషి

● డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ



ఎన్‌సీసీ క్యాడెట్లతో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ తదితరులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌సీసీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఏపీ, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ అన్నారు. గుంటూరు 10 ఆంధ్ర బాలికల బెటాలియన్‌ను గుంటూరు కల్నల్ సుదాన్షు దుబేతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సైలానీ మాట్లాడుతూ, విద్యార్థుల్లో జాతీయత భావాన్ని, దేశం పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు ఎన్‌సీసీ తోడ్పాటునందిస్తుందన్నారు. ఎన్‌సీసీలో చేరేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం జాతీయ స్థాయి శిబిరాల్లో అవార్డు గెలుచుకున్న క్యాడెట్లను ఆయన కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ కాలేజ్ ఫర్ ఉమెన్, ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల, గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలల బాలికల ఎన్‌సీసీ క్యాడెట్లు, కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ ఎస్వీఎస్ సుదర్శన్, ఏవో పట్వార్ పాల్గొన్నారు.

ఎవరయ్యేనో కోటీశ్వరులు..!

● అభివృద్ధిలో ప్రత్యేకత చాటితే రూ. కోటి నజరానా
● గ్రామ పంచాయతీలకు కేంద్రం ఆఫర్



సత్తెనపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిని సారించాయి. తాను నిర్దేశించిన తొమ్మిది అంశాల్లో పురోగతి సాధించిన పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నజరానాను ప్రకటించింది. స్థానిక అవసరాలు, భౌగోళిక అంశాలకు తగ్గట్టుగా పంచాయతీలు ప్రత్యేకతను చాటుకోవటం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన తొమ్మిది అంశాలను పరిగణనలోకి తీసుకొని పంచాయతీలకు పురస్కారాలు ప్రకటించనున్నారు. ప్రభుత్వ మార్గనిర్దేశాల మేరకు పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధిని డాక్యుమెంటరీ రూపంలో చిత్రీకరించి జిల్లా పంచాయతీ అధికారికి అందజేయాలి. వీటిని డీపీవో కార్యాలయ అధికారులు పరిశీలించి ఉత్తమమైనవిగా ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అధికారులు డిసెంబరులో పురోగతి, సూచిక ప్రగతిని గుర్తించి ప్రోత్సాహకానికి ఎంపికైన పంచాయతీలను ప్రకటిస్తారు. ఆయా పంచా యతీలకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నజరానాను అందజేస్తుంది.

తొమ్మిది అంశాలు ఇవే...

పంచాయతీల్లో ఏఏ అంశాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలో కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. అవి గ్రామ పంచాయతీలో పేదరికం లేని జీవనోపాధి కల్పన, ప్రజారోగ్యం, శ్రేయస్సును మెరుగు పరిచే కార్యక్రమాలు నిర్వహించటం, పిల్లల సంరక్షణ, అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించటం, ప్రజలకు స్వచ్ఛమైన నీటిని పుష్కలంగా అందుబాటులోకి తేవటం, గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచటం, మౌలిక సదుపాయల అభివృద్ధి, గ్రామంలో సామాజిక న్యాయానికి సురక్షిత వాతావరణం నెలకొల్పటం, శాంతియుతమైన న్యాయమైన బలమైన సంస్థలతో సుపరిపాలన, పంచాయతీ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయలు, విద్యా ఆరోగ్యం తదితర అంశాలు ఉన్నాయి. ఈ తొమ్మిది అంశాల్లో గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు వీలుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. పల్నాడు జిల్లాలో 329 పంచాయతీలు ఉండగా, వీటిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు ప్రత్యేకంగా ప్రణాళికను సిద్ధం చేశాయి. పంచాయతీలను ప్రగతిలో పథంలో నడిపేందుకు జిల్లా పంచాయతీ అధికారులు మండలాల్లో ఈవోపీఆర్‌డీలకు ఆదేశాలిస్తూ అమలుకు సన్నాహాలు చేస్తున్నారు.

వర్సిటీలో ఘనంగా హస్తకళల ప్రదర్శన

ఏఎన్‌యూ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హస్తకళలు ప్రాచీన వారసత్వానికి నిదర్శనమని ఏఎన్‌యూ ఫైన్ ఆర్ట్స్ విభాగం సహాయక సమన్వయకర్త డాక్టర్ దేవకాంత్ అన్నారు. మంగళవారం ప్రపంచ హస్తకళల దినోత్సవం సందర్భంగా ఏఎన్‌యూలోని లలిత కళల విభాగం ఆధ్వర్యంలో హస్తకళలతో కూడిన ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవకాంత్ మాట్లాడుతూ హస్తకళలు భారత ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటుతో పాటు సృజనాత్మకతను జోడించాయన్నారు. అనంతరం విద్యార్థులు కొండపల్లి, ఏటికొప్పాక, చెన్న పట్నం, పిచ్‌వాయి బొమ్మలు, మంగళగిరి, ధర్మవరం, కలంకారి చేనేత వస్త్రాలతో కూడిన హస్తకళల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు బి.జాన్ రత్నబాబు, శేఖర్‌బాబు, వీరయ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



హస్తకళల ప్రదర్శనలో విద్యార్థులు

వాటర్ షెడ్ పథకంతో
భూగర్భ జలాల పెంపు

● అమలు చేసేందుకు డ్వామా ప్రణాళికలు సిద్ధం

వినుకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా మండలాల్లో వందల అడుగుల లోతునకు బోర్లు తవ్వి నీరు తోడేస్తుండటంతో పాటు చెరువులు, కుంటల్లో పూడిక చేరి నీటి నిల్వకు అవకాశం లేకుండా పోయింది. దాంతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. అటువంటి చోట్ల వాటర్ షెడ్డు పథకం అమలు చేసేందుకు డ్వామా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల వృద్ధి, నేల కోత నివారణ ఉపాధి అవకాశాలు పెంపు లక్ష్యాలతో వాటర్ షెడ్ పథకం రూపకల్పన చేసింది. దీని కోసం జల సంరక్షణకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కృషి సంచాయి నిధులను కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి డ్వామా జిల్లా ప్రాజెక్టు సంచాలకుల ద్వారా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు పంపించామని అధికారులు తెలిపారు.

ఊట చెరువులు, రాక్ ఫిల్ డ్యామ్‌ల నిర్మాణం

వాటర్ షెడ్ పథకంలో భాగంగా వాగుల ప్రవాహ మార్గాలు, పరివాహక ప్రాంతాలలో చెక్ డ్యాములు, ఊట చెరువులు, పెర్కులేషన్ ట్యాంకులు, రాక్ ఫిల్ డ్యాములు నిర్మిస్తారు. ప్రతి నీటి బొట్టు వృథా కాకుండా నిల్వచేసి వినియోగంలోకి తెచ్చేందుకు ఇవి దోహదపడ తాయి. వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలంలో ఈ సంవత్సరం మార్చిలోనే బోర్లు ఎండిపోయాయి. దీంతో తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో ప్రభుత్వం 16 ఆవాస ప్రాంతాలకు మూడు నెలలపాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వచ్చింది. భూగర్భ జలాలు పరిమితికి మించి వినియోగించడంతో అక్కడ బోర్ల తవ్వకాలు నిషేధించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాం 2014-19 కాలంలో జిల్లాలో వాటర్ షెడ్ పథకం అమలు చేశారు. ఆ సమయంలో బొల్లాపల్లి మండలం రేమిడిచర్లలో 50 లక్షలతో చెరువులు కుంటలు ఆర్ఎఫ్‌టీలు నిర్మించారు. వాటిల్లో వాన నీరు చేరి డిసెంబరు వరకు నీరు ఉండేది. దీంతో ఆయా చుట్టుపక్కల బోర్లు అదనంగా మరో మూడు నెలలు పనిచేశాయని గ్రామస్థులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిన జిల్లాలోని పలు మండలాల్లో వాటర్‌షెడ్ పథకాన్ని అమలు చే సేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.



బొల్లాపల్లి మండలంలోని ఊటకుంట

జిల్లాలో గుర్తించిన మండలాలు..

అచ్చంపేట, బెల్లంకొండ, బొల్లాపల్లి, ఈపూరు, దుర్గి, కారంపూడి, మాచర్ల, రాజుపాలెం, వెల్దుర్తి, మాచవరం, పిడుగురాళ్ల, నకరికల్లు మొత్తం 12 మండలాలు గుర్తించగా ఈ మండలాల పరిధిలో 73 పంచాయితీలు 113 గ్రామాలు ఉన్నాయి.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 15-10-2025 | పేజీలు: 8 | వెల (Price) : Rs. 6.50

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: నవమి ఉ.10:34 తదుపరి దశమి, నక్షత్రం: పుష్యమి మ.12:00 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.1:10-2:49, దుర్ముహూర్తం: ఉ.11:37-12:24, అమృతఘడియలు: శేషం ఉ. 7.10, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:11, సూర్యాస్తమయం: 5:49

ఒంగోలు సిటీ

Ongole |Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Nallagonda | Nizamabad and Bengaluru

ఒకరి ప్రాణం తీసిన రాంగ్ రూట్



ఒంగోలు క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో మినీ వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన కర్నూలు రోడ్డులో మలాస చికెన్ షాప్ వద్ద మంగళవారం జరిగింది. కరవదికి చెందిన లారీ యజమాని సింగిశెట్టి వెంకటేశ్వర్లు (47) ఒంగోలు నుంచి పేర్నమిట్ట తన లారీ కోసం వెళుతున్నాడు. మార్గమధ్యలో ఒక పాఠశాలకు చెందిన మినీ వ్యాన్ రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయం అయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఒంగోలు తాలుకా పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేతుల శుభ్రత ప్రకటనలకే పరిమితమా?

- పాఠశాలల్లో కనిపించని 'హ్యాండ్ వాష్'
- అవగాహన కల్పించకపోవడంతో అనారోగ్యమే!

ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచేందుకు ప్రకటించిన పాఠశాలల్లో హ్యాండ్ వాష్ ప్రకటనలకే పరిమితమైంది. నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల్లో నీటి కొరత ఏర్పడటంతో చేతులు శుభ్రం చేసుకునే అంశం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ అందుబాటులో సరిపడా నీరు లేకపోవడంతో మురికి చేతులతోనే ముద్ద తినాల్సిన దుస్థితి కనిపిస్తోంది. దీంతో ఏడాదికి ఒకసారి మాత్రమే మొక్కుబడిగా హ్యాండ్ వాష్‌పై బక్కెట్ నీటితో అవగాహన కల్పించి ముగించేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు వరల్డ్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం..



చేతులను సబ్బుతో కడుక్కొన్న

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత తెలుగుదేశం పాలనలో పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు, అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రతి ఏడాదీ ఎస్ఎస్ఏ గ్రాంట్ కింద రూ.5వేలు నుంచి రూ.7వేల వరకు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సబ్బులు, టవల్స్ అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలి. విద్యార్థులకు అందుబాటులో ఉంచడంతోపాటు, భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులు కడుక్కుంటున్నారా? లేదా? అని పర్యవేక్షించాలి. కానీ ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచింది. కనీసం నిధులు కేటాయించకపోగా, ప్రచారం తప్ప పరిశుభ్రతను పట్టించుకున్న వారు లేరు. దీంతో విద్యార్థులు ఉదయం నుంచి పుస్తకాల చేతపట్టి, నోట్సులు రాసి, ఇంకులయిన చేతులతో, డ్రిల్ క్లాసులో చేతికంటిన మంటితోనే అలాగే భోజనానికి కూర్చోవడం కనిపిస్తోంది.

టవల్స్, సబ్బులు లేవు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల పరిశుభ్రతకు ప్రత్యేక నిధులు కేటాయించారు. తప్పనిసరిగా టవల్స్, సబ్బులు అందుబాటులో ఉంచాలి. మధ్యాహ్నం భోజన సమయంలో తప్పనిసరిగా తర్వాతే భోజనం చేయాలి. అందుకు ఆ పాఠశాలల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలి. కానీ అలాంటివీ ప్రభుత్వ పాఠశాలల్లో కనిచూపుమేరలో కూడా కనిపించడం లేదు. కేవలం తాగేందుకు మాత్రమే అరకొర నీటిని బబుల్స్ ద్వారా తెప్పిస్తుండగా, కొన్ని పాఠశాలల్లో అసలు తాగునీరు లేక విద్యార్థులు దాహంతో అల్లాడిపోతున్నారు. ఫలితంగా విద్యార్థులకు శ్వాసకోస, టైఫాయిడ్, కలరా, జ్వరం, కామెర్లు, విరేచనాలు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలంటే..

ముందుగా అరచేతిని సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తరువాత చేతుల వెనుక భాగం శుభ్రం చేయాలి. అనంతరం వేళ్ల వెనుక మణికట్టు భాగంలో కడగాలి. తర్వాత దశలో చేతి వేళ్ల మధ్య కడగాలి. చివరిగా చేతి వేళ్ల గోళ్లను శుభ్రం చేసుకున్న తర్వాతనే భోజనం చేయాలి. భోజనం చేసే ముందు, మల విసర్జనకు వెళ్లివచ్చిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత, దగ్గినపుడు, తుమ్మినపుడు చేతులు అడ్డుపెట్టుకోవడం ద్వారా క్రిములు చేతికి అంటుకునే ప్రమాదం ఉంది. అందువల్ల శుభ్రత చాలా ముఖ్యం.

గ్రామాల అభివృద్ధి బాధ్యత కార్యదర్శులదే

- ప్రజారోగ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి
- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధి, సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని కలెక్టర్ రాజాబాబు అన్నారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం ఒంగోలు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించడంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీకి సంరక్షణ అధికారిగా (కస్టోడియన్) కార్యదర్శులపై తమ పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన అంశమని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీటి సమస్య కేవలం ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి మాత్రమే చెందినదిగా అనుకోవద్దని, స్థానిక పరిస్థితులపై పంచాయతీ కార్యదర్శుల సమగ్ర పరిశీలన అవసరమని అన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- 16న పీఎం శ్రీశైలం రూట్లు మార్పు
- దోర్నాల - శ్రీశైలం, గుంటూరు - కర్నూలు వెళ్లే వాహనాల మళ్లింపు
- మార్కాపురం డీఎస్పీ నాగరాజు

పెద్ద దోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం పుణ్యక్షేత్ర సందర్శనకు ఈనెల 16వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే వాహనాలను దోర్నాల వద్దే నిలిపివేయనున్నామని, ఈ విషయాన్ని యాత్రికులు గమనించాలని ఆయన కోరారు. గుంటూరువైపు నుంచి కర్నూలు వెళ్లే వాహనాలను పెద్దారవీడు కుంట జంక్షన్ వద్ద దారి మళ్లించి గిద్దలూరు, నంద్యాల మీదుగా వెళ్లేలా రూట్ మార్చినట్లు చెప్పారు. కర్నూలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే యాత్రికులు కూడా వీలైనంత వరకు ఆరోజు ప్రయాణం వాయిదా వేసుకోవడం ఉత్తమమన్నారు. అప్పటికే ప్రయాణం చేసి దోర్నాల వచ్చిన వారు మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి ఉండాల్సిందేనని, ఇందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ రావు, ఎస్సై మహేశ్ పాల్గొన్నారు.

మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి రైతు ఆత్మహత్య

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు (50) మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు రెండెకరాలు పొలముంది. సేద్యంలో నష్టాలు రావడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఏ పనిచేసినా కలిసి రావడం లేదనే ఆత్మన్యూనతతో దిగులు పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీ మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

కదిలే రైళ్లపై రాళ్లు విసిరిన నిందితుల అరెస్ట్

- మూడురోజుల క్రితంచీరాల ఆర్వోబీ వంతెన సమీపంలో ఘటన
- నేరస్థులు ముగ్గురు చీరాలకు చెందిన వారే



వివరాలను వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

చీరాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కదిలే రైళ్లపై రాళ్లు విసిరిన చీరాలకు చెందిన ముగ్గురు నిందితులను చీరాల ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం వివరాలను ఆర్‌పీఎఫ్ సీఐ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. చీరాలకు చెందిన రావూరి మణికంఠ, జగతా సాయివంశీ, మానుపాటి శ్రీను గత ఆదివారం రాత్రి గూడ్సు రైలు (టీఎల్ఎస్), విక్రమ సింహపురి(12744)రైళ్లపై రాళ్లు విసిరారు. ఆ సమయంలో ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో ముగ్గురిపై రైల్వే చట్టం 153 కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్సై కొండయ్య, ఆర్‌పీఎఫ్ ఎస్సై మనోజ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ గోడ కూల్చివేత

- అడుగు ముందుకేసిన అధికారులు
- తీరంలో అక్రమ కట్టడం తొలగింపు
- కొద్ది రోజులుగా రిసార్ట్ నిర్వాహకులు, అధికారుల మధ్య వివాదం



గోడను కూల్చివేయించిన తహసీల్దార్ గీతారాణి, అధికారులు

రామాపురం(చీరాల), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రామాపురం తీరంలో కొంతకాలంగా ఓ రిసార్ట్ నిర్వాహకునికి, అధికారులకు మధ్య జరుగుతున్న కోల్డ్‌వార్‌లో మంగళవారం అధికారులు ఒక అడుగు ముందుకేశారు. సీఆర్‌జడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) నిబంధనలు అతిక్రమించి నిర్మించిన గోడను కూల్చివేశారు.

రామాపురం తీరంలోని అర్య గ్రాండ్ రిసార్ట్ నిర్మాణంపై కొంతకాలంగా నిర్వాహకులకు, అధికారులకు మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. ఈ నిర్మాణం అక్రమమంటూ గతంలో ఉన్న కలెక్టర్ వెంకట మురళీ ఆధ్వర్యంలో నోటీసులు కూడా అందించారు. అయితే తనకు అనుమతులున్నాయని, నిర్వాహకులు కోర్టును ఆశ్రయించడంతో ఎటూ తేల్చలేక అధికారులు మల్ల గుల్లాలు పడ్డారు. వదిలేద్దామా..? న్యాయపోరాటం చేద్దామా..? అని అధికారులు ఒక దశలో మల్లగుల్లాలు పడ్డారు.

ఇదీ నేపథ్యం..

ప్రస్తుతం నడుస్తున్న రిసార్ట్‌ను గొర్రెల పెంపకం షెడ్డుగా ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రారంభసమయంలో అందుకు సంబంధించిన ఆధారాలు కూడా సేకరించారు. అయితే కొద్దిరోజులు అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కొంతకాలం తర్వాత అటువైపు చూసి నివ్వెరపోయారు. ఏకంగా ఆధునిక హంగులతో రిసార్ట్‌గా రూపుదిద్దుకుంది. దీంతో అప్పటి నుంచి అధికారులు నోటీసులు ఇవ్వడం, తిరిగి రిసోర్టు యజమాని న్యాయస్థానాన్ని ఆశ్రయించడం పరిపాటిగా మారింది. అధికారులు ఒక దశలో విసిగి వేసారిన అధికారులు 46 శాతం అపరాధ రుసుము చెల్లించుకుని కథను ముగించాలని కూడా సదిగ్ధంలో పడ్డారు.

మలుపు తిరిగిందిక్కడ..!

అయితే రిసార్ట్ నిర్వాహకులు మరో స్థలంలో కూడా కట్టడం నిర్మించేందుకు గోడను నిర్మించారు. అది సీలింగ్ ల్యాండ్ సర్వే నెంబర్ 427/3- 3బి/2సీలో ఉందని అనధికారమని అధికారులు మళ్లీ నోటీసులు ఇచ్చారు. అయినా సెలవు రోజుల్లో అధికారులు కళ్లుగప్పి నిర్మాణం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకున్నాడు. వెంటనే గోడ తొలగించాలని నోటీసులు స్పందన లేకపోవడంతో మంగళవారం ఏకంగా వేటపాలెం తహసీల్దార్ గీతారాణి ఆధ్వర్యంలో వీఆర్వోలు, పోలీసుల సమక్షంలో గోడను కూల్చారు. దీంతో ఒకింత అక్రమ నిర్వహణ దారుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమైంది.

నేటి నుంచి ఖోఖో జట్టుకు శిక్షణ

పంగులూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టుకు 15న బుధవారం నుంచి పంగులూరులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. 31వ దక్షిణమండలి జాతీయస్థాయి పురుషుల ఖోఖో పోటీలు కర్నాటక రాష్ట్రంలోని ధావణగిరి పట్టణంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని సీతారామిరెడ్డి తెలిపారు. ఈ పురుషుల జట్టుకు పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో ఈ నెల 22 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోచ్‌గా సీనియర్ ఖోఖో క్రీడాకారుడు షేక్ ఆలీనవాజ్ వ్యవహరిస్తారన్నారు. గ్రామస్థులు, దాతల సహకారంతో భోజనవసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

మార్టూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో మంగళవారం కాటూరి మెడికల్ కళాశాల, వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ వ్యాధులకు సంబంధించి 185 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ నాయకులు మిన్నెకంటి రవికుమార్ వైద్యశిబిరానికి సహాయసహకారాలు అందించారు. కార్యక్రమంలో వైద్యశాలకు చెందిన పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ

అద్దంకి,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పీపీపీ పేరుతో మెడికల్ కళాశాలలను నాయకులు కట్టబెట్టాలని చూస్తున్నారని వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ ను నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టిన క్రమంలో మంగళవారం అద్దంకిలో డాక్టర్ అశోక్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో పలు గ్రామాల వైసీపీ నేతలు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల మెరుగునకు జీఎస్టీ దోహదం

● ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్

పర్చూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపునకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఎంపీడీవో వీ.ప్రద్యుమ్నకుమార్ అన్నారు. దీనివల్ల ప్రభుత్వాలకు కొంత ఆర్థిక భారం అయినప్పటికీ ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచి ఆర్థిక పురోగతిని సాధించాలన్న సంకల్పంతో జీఎస్టీ స్లాబ్‌లో మార్పులు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో అధ్వర్యంలో ఆయా శాఖల అధికారులతో కలిసి తగ్గిన జీఎస్టీ వివరాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కొసనా సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి మస్తాన్‌రావు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ సౌకర్యం

స్విచ్ఛాన్ చేసిన ఈఈ మస్తాన్‌రావు


మోటారు స్విచ్ ఆన్ చేస్తున్న ఈఈ మస్తానరావు

పంగులూరు, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో 26 వ్యవసాయ పంపుసెట్లకు 6 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు విద్యుత్‌శాఖ ఈఈ మస్తానరావు తెలిపారు. రైతులు తమ పంటపొలాలలో సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న వ్యవసాయబోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆశ్రయించారు. ఈ విషయమై వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో స్పందించిన ఆయన మూడునెలల్లో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. నూతనంగా ఏర్పాటుచేసుకున్న విద్యుత్‌మోటార్లకు మంగళవారం ఆయన విద్యుత్‌సరఫరా ప్రారంభించారు. 26 వ్యవసాయ బోర్లకు ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్‌సౌకర్యం కల్పించేందుకు రూ.37,50,733ల వ్యయ అంచనా కాగా రైతులు తమ వాటాగా రూ.2.35 లక్షలు చెల్లించారన్నారు. ప్రభుత్వం రూ.36,76,482లు రాయితీ ఇచ్చినట్లు ఈఈ తెలిపారు. ఇంచుమించు వందెకరాలకు సాగునీరు అందేలా వ్యవసాయబోర్లకు విద్యుత్‌సౌకర్యం కల్పించిన మంత్రి గొట్టిపాటికి, విద్యుత్‌శాఖ అధికారులకు స్థానిక నేతలు ఎనికపాటి శ్రీనివాసరావు, పూనాటి రామాంజనేయులు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లపూడిఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ దామోదరం, ఏఈఈ ఆంజనేయులు, అంజయ్య, శ్రీనివాసరావు, సింగర్, రైతులు పాల్గొన్నారు.

నేడు మెగా కంటి వైద్య శిబిరం

అద్దంకిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అద్దంకి బంగ్లారోడ్డులోని ప్రేమ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్ 3వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటల నుండి వైద్యశాలలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జి. షాలేంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రోగులకు ఉచిత కంటి పరీక్షలు, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన పేదలకు ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక డిస్కౌంట్ ధరలలో కళ్ళజోళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అద్దంకి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెండు రోజులు అరకొర బస్సులే

● కర్నూలుకు వెళ్తున్న 25 సర్వీసులు

అద్దంకి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి):కర్నూలు జిల్లాలో పీఎం మోదీ పర్యటన నేపథ్యంలో అద్దంకి డిపో నుంచి 25 బస్సులను పంపుతున్నారు. అద్దంకి డిపోలో మొత్తం 69 బస్సులుండగా, వాటిలో 25 అద్దె బస్సులు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో గురువారం పీఎం నరేంద్ర మోడీ పర్యటన ఉన్న నేపథ్యంలో 25 ఆర్టీసీ బస్‌లను బుధవారం ఉదయం పంపుతున్నారు. గురువారం బహిరంగ సభ ముగిసిన అనంతరం తీసుకువెళ్లిన ప్రజలను మరలా గ్రామాలలో దించి శుక్రవారం ఉదయంకు బస్సులు అద్దంకి చేరుకునే అవకాశం ఉంది. దీంతో బుధ, గురువారంలలో పలు రూట్లలో బస్ సర్వీసులు రద్దు కానున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బల్లికురవ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేని వారిపాలెం గ్రామంలో సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు నాయుడు లక్ష్మీనారాయణ(29) వైద్యశాలలో చి కిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ వైనాగరాజు మంగళవారం తెలిపారు. ఓ మహిళను వేధింపులకు గురిచేసిన ఘటనలో లక్ష్మీనారాయణపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. దీంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించాడు. మృతుడి భావ దర్శి కాంతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఏబీసీలో మహిళ మృతదేహం లభ్యం

బల్లికురవ,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకు వచ్చింది. వైదన సమీపంలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసుకు సమాచారం అందించారు. ఎస్సై నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 45 ఏళ్ల వయస్సు ఉన్న మహిళ మృతదేహంగా గుర్తించారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం పిట్టంబండ కు చెందిన మహిళగా భావిస్తున్నారు. మృతదేహం బయటకు తీసేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

అద్దంకి,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి కారు నడిపిన వ్యక్తికి అద్దంకి కోర్టులో మంగళవారం న్యాయాధికారి అఖిల రూ.10 వేల జరిమానా విధించారు. పట్టణంలోని భవానిసెంటర్ లో మద్యం సేవించి కారు నడుపుతుండగా సీఐ సుబ్బరాజు అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి అపరాధ రుసుము విధించారు.

కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలు

- అమ్మాయి ఫొటోతో ఫేస్‌బుక్ ఖాతా
- రైస్ మిల్ నిర్వాహకుడిని బెదిరించి రూ.కోటి స్వాహా
- సంపాదించినదంతా క్రికెట్ బెట్టింగ్‌లో సమర్పణ

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలకు పాల్పడుతోన్న బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన చోడ చైతన్య కృష్ణ పవన్ (27) అనే నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరచి వివరాలు వెల్లడించారు. గుంటూరులోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన ఓ రైస్‌మిల్ నిర్వాహకుడికి ఆరు నెలల కిందట ఫేస్‌బుక్ మెసెంజర్‌లో శైలజ మార్ని పేరుతో నిందితుడు హాయ్ అని మెసేజ్ పెట్టాడు. కాల్ బాయ్‌గా వెళ్తే డబ్బులు వస్తాయని నిందితుడు చెప్పగా అందుకు బాధితుడు తన వయసు 68 సంవత్సరాలని, తనకు ఇష్టం లేదని స్పందించాడు. చివరకు బాధితునితో మాటలు కలిపి అతని పూర్తి వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత వేరే నంబర్‌తో ఫోన్లు చేసి తాము పోలీసులమనీ, నువ్వు మహిళలతో అసభ్యంగా చాట్ చేస్తున్నట్లు నీ మీద కేసు నమోదైందని చెప్పాడు. కేసు నుంచి తప్పించడానికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని బెదిరించాడు. అలాగే మరో నంబర్‌తో బాధితుడుకి ఫోన్ చేసి తాము ఆదాయపన్నుశాఖ అధికారులమని, రైస్ మిల్లుపై రైడ్ చేయడానికి వస్తున్నామని చెప్పాడు. రైడ్ చేయకుండా ఉండాలంటే డబ్బులివ్వాలని బెదిరించాడు. ఇలా బెదిరించి పలు దఫాలుగా బాధితుడిని భయపెట్టి రూ.కోటి వరకు కాజేశాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి ఐ ఫోన్‌తో సహా రెండు సెల్‌ఫోన్లు, నాలుగు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కాగా బాధితుడు కొట్టేసిన నగదును ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టాడని చెప్పారు. బిహార్, యూపీ తదితర రాష్ట్రాల్లో అమాయకుల పేరుతో తప్పుడు ఖాతాలు సృష్టించి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, వాటిపై కూడా దృష్టి సారించి సొత్తు రికవరీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలు, స్నేహ అభ్యర్థనలు మొదలైన వాటికి స్పందించవద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా అనుమానంగా ఉన్నా, ఎవరైనా బెదిరింపులకు పాల్పడుతున్నా వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో గానీ, డయల్ 112 లేదా 1930 నంబర్లకు గానీ సంప్రదించాలని ఎస్పీ సూచిం చారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పట్టాభిపురం సీఐ గంగా.వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్ కుమార్, ట్రైనీ ఎస్సై ప్రదీప్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావును, ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాషా, హెడ్ కానిస్టేబుల్ రాజా కిషోర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి వారికి ప్రశంసాపత్రాలు అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఉపాధి అక్రమాలు వెలుగు చూసేనా..?

- కప్పిపుచ్చేందుకు పెద్దస్థాయిలో అక్రమార్కుల పైరవీలు
- గ్రామాల్లో కొనసాగుతున్న ఆడిట్

అద్దంకి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉపాధి అక్రమాలకు అంతేలేకుండా పోయింది. ఉపాధి పనులు నిర్వహణపై సోషల్ ఆడిట్ నిర్వహించినా, పలు మండలాలలో మొక్కుబడిగా మాత్రమే నిర్వహించారు.

సంతమాగులూరు మండలంలో సోమ వారం నుండి ఉపాధిహామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు ప్రారంభించింది. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో కామేపల్లి, మిన్నెకల్లు, పత్తేపురం, పరిటాల వారిపాలెం, కుందుర్రు, మామిల్లపల్లి, పుట్టావారిపాలెంలలో పరిశీలన చేశారు. నెల రోజుల క్రితం జరగాల్సిన ఈ పరిశీలన, సోషల్ ఆడిట్‌ను ఒత్తిడి చేయించి వాయిదా వేయించుకుంటూ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే బల్లికురవ మండలంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చిన తనిఖీ బృందం కాకుండా బాపట్ల జిల్లాకే చెందిన ఓ అధికారి పర్యవేక్షణలోని బృందం నేతృత్వంలో తనిఖీలు చేయించటం పలు అనుమానా లకు తావిస్తుంది. సంతమాగులూరు మండలంలోని అడవిపాలెం, పాత మాగులూరు, సంతమాగులూరు, వెల్లల చెరువు, కుందుర్రు, సజ్జాపురం, పుట్టావారి పాలెం, చవిటిపాలెం తదితర గ్రామాలలోని ఉపాధి పనులలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు, కలెక్టర్‌కు, ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేశారు. అయితే గ్రామాలలో జరిగే సోషల్ ఆడిట్‌లో ఎలాంటి అ క్రమాలు వెలుగు చూడకుండా ఉండే విధంగా సిబ్బంది అన్ని ముందస్తు జా గ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే లైవ్ సోషల్ ఆడిట్ కావడంతో తనిఖీ చేసే ఆడిట్ బృందం కూడా అక్రమాలు కప్పి పుచ్చేందుకు సంసిద్ధంగా ఉంటారా..?, లేదా..? అన్న విషయం తెలియాల్సి ఉంది. జిల్లాలోని పలు మండలాలలో ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్ మొక్కుబడిగా జరగ్గా బల్లికురవ మండలంలో మాత్రం లైవ్ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఉపాధి పనుల పరిశీలన చేసిన బృందం నిక్కచ్చిగా వ్యవహరించడంతో పెద్దఎత్తున అ క్రమాలు వెలుగు చూశాయి. జిల్లా ఉపాధిహామీ పథకం అధికా రులు అ క్రమాలను తక్కువ చూ పించేం దుకు తీ వ్ర స్థాయిలో ప్రయత్నం చేసి చివరకు సుమారు రూ.3 కోట్ల వరకు అక్రమాలు చోటు చేసుకున్నట్లు నిగ్గు తేల్చారు. అక్రమాలు నిగ్గు తేల్చినా చర్యలకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. అయితే ఎట్టకేలకు త్వరలో కొంతమంది సిబ్బంది పై వేటు వేసేందుకు జిల్లా అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తి స్థాయి పర్యవేక్షణలో సంతమాగులూరు మండలంలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తే అక్రమాలు పెద్దఎత్తున వెలుగు చూసే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు అభి ప్రాయపడుతున్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న ఆడిట్ బృందం

క్రికెట్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో కొప్పరం విద్యార్థి సిద్ధార్థ సత్తా



చాంపియన్ ట్రోఫీతో సిద్ధార్థ

సంతమాగులూరు అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొప్పరం గ్రామానికి చెందిన మొగిలి వీర వెంకట శివనాగ సిద్ధార్థ సబ్ జూనియర్, సీనియర్స్ ఎలెవన్ క్రికెట్ నేషనల్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటాడు. ఈ నెల 11, 12, 13వ తేదీలలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో కాసుల బ్రహ్మానందరెడ్డి కళాశాల మైదానంలో జరిగిన పోటీలలో అండర్-14, జూనియర్, ఏపీ ఏ టీమ్‌లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. నరసరావు పేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో ఇండియా అండర్-14 తరపున ఆడే అవకాశం వస్తుందని సిద్ధార్థ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా సిద్ధార్థ నరసరావుపేట లోని సీబీఐటీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా సిద్ధార్థ నుకోచ్ అఖిల్‌ను మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

పవన్, గోపీకృష్ణకు ఎమ్మెల్యే అభినందన

పర్చూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సేవింగ్ అంశంపై అత్యుత్తమ ప్రతిభ కనపర్చి ప్రధాన నరేంద్ర మోడీతో ముఖాముఖికి అరుదైన అవకాశం పొందిన మార్టూరు మండలం బొల్లాపల్లి విద్యార్థి చాతారాజుపల్లి పవన్ గోపీకృష్ణను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు. బొల్లాపల్లికి చెందిన పవన్ వంగులూరు మండలం కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ అద్భుత ప్రతిభ కనపరిచారని పేర్కొన్నారు. ఈనెల 16న గోపికృష్ణ శ్రీశైలంలో ప్రధాని నరేంద్ర మోడీని కలిసే అవకాశం రావడం ప్రతిభకు నిదర్శనం అన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా

- విద్యార్థులకు తప్పిన ప్రమాదం

చీరాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల - కారంచేడు రోడ్డులో ప్రైవేటు స్కూలు బస్సు బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకొంది. ప్రమాద సమయంలో బస్‌లో సుమారు 35 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. పిల్లల్లో కొంతమందికి మాత్రమే స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. వీరిని ప్రత్యేక వాహనం ద్వారా నిర్వాహకుల ఇళ్లకు చేర్చారు. అయితే డ్రైవర్ వేగాన్ని అదుపు చేయలేక పోవడంతో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారు. ఎవ్వరికీ ఇబ్బంది లేకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

25 శాతం రాయితీతో శనగ విత్తనాలు

మార్టూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):రబీ సీజనుకు శనగ విత్తనాలను మండలంలోని రైతులకు 25 శాతం రాయితీతో ఇవ్వనున్నట్లు ఏవో కుమారి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎకరాకు 40 కిలోల వంతున గరిష్ఠంగా రైతుకు 5 ఎకరాలకు విత్తనాలను ఇవ్వన్నట్లు తెలిపారు. రైతులకు జేజీ-11 రకం, కేఏకే- 2 రకం విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ సీమౌత్ దగ్గర సర్వే పూర్తి
- కలెక్టర్‌కు సమర్పించనున్న నివేదిక

బాపట్ల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాలతో అధికార యంత్రాంగం అడవిపంచాయతీ పరిధిలో ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ సముద్రంలో కలిచే ప్రాంతానికి కదిలి వెళ్ళారు. జిల్లాలోని సముద్రతీరప్రాంతంలో 10గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఇటీవల ఉదయం నుంచి సాయంత్రం వరకు జీబీసీరోడ్డుపై బైటాయించి సమస్య పరిష్కరించాలంటూ ఆందోళన చేయటంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గత రెండురోజులుగా ఆర్డీవో పి.గ్లోరియా ఆధ్వర్యంలో ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ డ్రైన్ సముద్రంలో కలిసే ప్రాంతంలో మంగళవారం సర్వే చేశారు. తొలుత స్థానికులు సహకరించకపోయినప్పటికి కలెక్టర్ ఆదేశాల మేరకే తాము సర్వే చేస్తున్నామని చెప్పటంతో వారు సహకరించారు.దీంతో ఆప్రాంతంలో డ్రైనేజి విస్తీర్ణం, పట్టాభూమి, డీకెభూమిని పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు గుర్తించారు. మత్స్యకారులు, రైతుల సమక్షంలో సర్వే చేయటం జరిగింది. డ్రైనేజి పొంగి పొర్లి తన భూమి కోతకు గురైందని రైతు, పడవలు కాల్వలో నుంచి సముద్రంలోకి వెళ్ళే సమయంలో బుర్ల వెంకట్రావు అనే రైతు కాల్వలో వేసిన కొండరాళ్ళ వల్ల పడవలు దెబ్బతింటున్నాయని మత్స్యకారులు అధికారులకు వివరించారు. అయితే అక్కడ వాస్తవ పరిస్థితిని సర్వే ద్వారా గుర్తించారు. హద్దులు చూపించారు. దీనికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్.సలీమా, సీఐ శ్రీనివాసరావు, సర్వేయర్ లక్ష్మీనారాయణ, డ్రైనేజి డీఈ మురళి కృష్ణ, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు.


మత్స్యకారులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో గ్లోరియా

ప్రశ్నపత్రాల జారీలో ప్రత్యేక రూల్

- క్లస్టర్ పాఠశాలల ద్వారా జారీ చేయాలని నిబంధన
- ప్రశ్నించిన ఐదు పాఠశాలలకు మాత్రం ప్రత్యేక
- నిత్యం మండల కేంద్రానికి రావాల్సిందేనంటూ హుకుం

సంతమాగులూరు(అద్దంకి),అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్‌ఏ-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. అయితే సంతమాగులూరు మండలంలో మాత్రం నిబంధనలు సక్రమంగా అమలుకావడం లేదు. అయితే కొందరిపై మాత్రం లేని నిబంధనలు కూడా పాటించాలని హుక్కుం జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఉపాధ్యాయులు విద్యాశాఖ కమిషనర్‌కు తగు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ఎఫ్‌ఏ 2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రాథమిక పాఠశాలలకు ఆయా సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను క్లస్టర్ హైస్కూల్‌లో పరీక్షా సమయం కంటే ఒక గంట ముందు పత్రాలను ఇవ్వాల్సి ఉంది. ఇక ఉన్నత పాఠశాలలకు మాత్రం ఎంఈవో కార్యాలయంలో ఇవ్వాలి. అయితే సంతమాగులూరు మండలంలో మాత్రం కొన్ని పాఠశాలలకు ఒక నిబంధన, మరికొన్ని పాఠశాలలకు మరో నిబంధన అమలు చేస్తున్నారు. దీంతో మండల విద్యాశాఖ తీరు విమర్శలకు తావిచ్చింది. సంతమాగులూరు మండలంలో మొత్తం 56 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఏల్చూరులో ఐదు ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఈ ఐదు పాఠశాలలకు మినహా మిగిలిన 51 పాఠశాలలకు సోమవారం ఉదయమే 4 సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు అందజేశారు. 'ముందే ఎలా ఇస్తారు' అని ఏల్చూరు లోని ఓ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రశ్నించడంతో 5 పాఠశాలలకు మాత్రం రోజుకు రెండుసార్లు చొప్పున నాలుగు సార్లు సంతమాగులూరు లోని ఎంఆర్‌సీ కార్యాలయానికి పిలిపించారు. అయితే ఏల్చూరు క్లస్టర్ హైస్కూల్‌లో పత్రాలు ఇవ్వాల్సి ఉండగా, ఇక్కడి సిబ్బందిని మాత్రం ఉద్దేశ్యపూర్వకంగా నాలుగుసార్లు సంతమాగులూరు ఎంఆర్‌సీకి పిలుపించుకుంటున్నారు. దీంతో ఏల్చూరులోని ఐదు పాఠశాలల ఉపాధ్యాయులు ఈ అంశంపై విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సోమవారం ఉదమే మిగిలిన అన్ని పాఠశాలలకు నిబంధనలకు విరుద్ధంగా ప్రశ్నాపత్రాలు మంజూరు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక ఎంఆర్‌సీలో ఉపాధ్యాయులపై పక్షపాత దోరణిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి కూడా పలువురు ఉపాధ్యాయులు తీసుకుపోయారు. ఉన్నతాధికారులు ఈ అంశం విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు

- ఉన్నత పాఠశాలలో వసతులను పరిశీలించిన డీఐఈవో
- గ్రామస్థులు, హెచ్ఎంతో సమావేశం


పాఠశాలలో వసతులను పరిశీలిస్తున్న డీఐఈవో జుబేర్

పంగులూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. జూనియర్ కళాశాలల డీఐఈవో జీకే జుబేర్ మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. కళాశాల నిర్వహణకు అవసరమైన వసతులు పరిశీలించారు. గత ఏడాది డిసెంబరు 7న పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు చందలూరు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామంలో జూనియర్ కళశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై పరిశీలించి, జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి సంబంధిత అధికారులకు సూచించారు. దీంతో డీఐఈవో చందలూరు ఉన్నత పాఠశాలలో గ్రామపెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులుతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కళాశాల ఏర్పాటుకు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల రాకపోకలకు ఉన్న సౌకర్యాలు తదితర వివరాలను సమావేశంలో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జూనియర్ కళశాల ఏర్పాటు అవసరం, గదుల వసతి కల్పన గురించి సవివరంగా నివేదిక ఇవ్వాలని హెచ్ఎం. గిరిజకు సూచించారు. గ్రామస్థులు కమిటీగా ఏర్పడి కళాశాల ఏర్పాటు, నిర్వహణ లో తమతోడ్పాటును అందజేయాలన్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి కళాశాల ఏర్పాటు విషయమై అనుమతి కోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు డీఐఈవో తెలిపారు. జూనియర్ కళాశాల తమ గ్రామంలో ఏర్పాటు చేస్తే పది గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ.సుబ్బారావు, హెచ్ఎం.గిరిజ, మంత్రి కార్యాలయ ప్రతినిధి బాలాజీ, అజిత్‌ట్రస్ట్ ఛైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, పెంట్యాల రామలింగస్వామి, విశ్రాంత హెచ్ఎం ఎన్.తాతయ్య, అంకమ్మ, అడ్డగడ సుబ్బయ్య, సతీష్, జగబాబు పాల్గొన్నారు.

విశాఖకు గూగుల్‌రాక టెక్ విప్లవానికి నాంది

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఒక కొత్త యుగం అరంభమైందని, విశాఖకు గూగుల్ రావటం ఏపీలో గేమ్ ఛేంజర్ కానుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఏలూరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం ప్రారంభం కానుందన్నారు. ఇది కేవలం ఒక పెట్టుబడి కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను మార్చే చారిత్రాత్మక పరిణామం అన్నారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ వచ్చిన తరువాత అక్కడకి అనేక ఐటీ కంపెనీలు క్యూట్టాయని దీంతో హైదరాబాద్ స్వరూపమే మారిందన్నారు. రూ.15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ విశాఖలో సౌత్ అసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ను నిర్మించబోతుందని తెలిపారు. డేటా సెంటర్ ఏర్పాటుతో 1.88 లక్షల మందికి ఉపాధి లభి స్తుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయం అన్నారు.

సీఎం కృషి ఫలితమే

ఉమ్మడి రాష్ట్రంలో హైదరా బాద్లో మైక్రోసాఫ్ట్‌ను తీసుకు వచ్చిన నగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు అదే దిశగా విశాఖను ఏఐ, డిజిటల్ టెక్ సిటీగా తీర్చిదిద్దబోతున్నారన్నారు. సౌత్ అసియాలో అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ గూగుల్ విశాఖకు రావటం చంద్రబాబు నాయుడు కృషియే కారణం అన్నారు.

గూగుల్‌రాకతో రాష్ట్రానికి మేలు



విలేకర్లతో మాట్లాడుతున్న గౌరీఅమర్నాథ్

చీరాల : విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రానికి ఏటా రూ.10 వేల కోట్లు ఆదాయం ఉంటుందని యువనాయకులు గౌరీ అమ ర్నాథ్, మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివ రావు పేర్కొన్నారు. మంగళవారం నియోకవర్గ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి ఆదాయ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తున్నట్లు చెప్పారు. వారి వెంట కూటమి నేతలు సజ్జా హేమలత, కొత వరపు జనార్ధనరావు, గంజి పురుషోత్తం, సల్లూరి సత్యానందం,పద్మిని, నాగలక్ష్మీ పాల్గొన్నారు.